




తంటికొండ వెంకన్నకు పూజలు చేస్తున్న అర్చకులు

తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు ఆరంభం

గోకవరం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం తంటికొండ గ్రామంలో స్వయంభూ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.దేవస్థానం మాజీ చైర్మన్ బది రెడ్డి అచ్చన్నదొర ఆధ్వర్యంలో మొదటిరోజున ఆలయ ప్రదక్షణ,స్వామి వారి పాదసేవ, హారతి, పంచమి సోమవారం సంకల్పం, విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం,రుత్విక్ వరుణ, దీక్షధారణ, అకల్మషకుష్మాండ హోమం,నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.స్వామికి వివిధ రకాల పూలతో అలంకరించగా,ఆలయాన్ని విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు.బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఉత్సవాలు 9వ తేదీ వరకూ జరుగుతాయి.

3 వేల సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యుత్ శాఖ ద్వారా 2000, డీఆర్‌డీఏ ద్వారా 1000 యూనిట్లు స్థాపన లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టరేట్‌లో సోమవారం ఏపీ ట్రాన్స్‌కో, క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు.గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించాలనే లక్ష్యంతో సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుపై దృష్టి సారించినట్టు చెప్పారు. ఎక్కువ విద్యుత్ వినియోగించే వినియోగదారుల జాబితా సిద్ధం చేసి వారి గృహాలకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.ఈ మేరకు మండలాల వారీ టార్గెట్లు నిర్ణయించుకోవాలన్నారు.సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్ కుమార్,డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీవీఎస్.మూర్తి,ఈఈలు,ఏఈలు పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డీఈవో

దివాన్‌చెరువు, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషిచేస్తున్నామని డీఈవో కంది వాసుదేవరావు అన్నారు. రాజానగరం మండలం పుణ్యక్షేత్రం జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు.పది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, విద్యార్థుల ప్రగతి గ్రేడుల వివరాలను హెచ్‌ఎం తాతారావును అడిగి తెలుసుకున్నారు.పబ్లిక్ పరీక్షలకు ఇక 40 రోజులు మాత్రమే సమయం ఉన్నందున ప్రతిక్షణం ఎంతోవిలువైనదన్నారు.పరీక్షలు అయ్యే వరకూ ఎవరూ మొబైల్ ఫోన్లు వాడవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాలు, చాటింగ్‌లు పూర్తిగా మానేయాలన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని సూచించారు. సెలవుల్లో కూడా పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

మళ్లీ ఓటు..రూటు!

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- ఎమ్మెల్సీపై కూటమి వ్యూహం
- పేరాబత్తులకే మద్దతు
- నామినేషన్లు ప్రారంభం
- ఈ నెల 27న పోలింగ్
- కూటమి కేడర్‌లో ఊపు
- పార్టీల వారీగా సమావేశాలు
- కానరాని మిగిలిన అభ్యర్థులు



ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నిడదవోలు మునిసిపల్ చైర్మన్ ఆదినారాయణ అభివాదం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కైవశం చేసుకోవడానికి తెలుగుదేశం-జనసేన- బీజేపీ కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికను కూటమి అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొంది.ఈ స్థానాన్ని గెలిపించే బాధ్యతను గోదావరి జిల్లాల నేతలకు, శ్రేణులకు అప్పగించింది. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 3 లక్షలకు పైగా పట్టభద్రుల ఓట్లు ఉన్నాయి. ఇప్పటికే కూటమి నేతలు, శ్రేణులు నియోజకవర్గాల వారీ సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు వేలాది మంది పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించిన సంగతి తెలిసిందే. సోమవారం నామినేషన్ల పర్వం ఆరంభం కావడంతో కూటమిలో మరింత ఉత్సాహం పెరిగింది. కూటమి నేతలు, కేడర్ ఐక్యంగా అభ్యర్థిని గెలిపించే పనిలో నిమగ్నమయ్యారు.ఇదిలా ఉండగా మిగిలిన అభ్యర్థులు ఎక్కడా కానరాకపోవడం శోచనీయం.కనీసం ప్రచారం లోనూ ఏ ఒక్కరూ ముందు లేరు. మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో సోమవారం నిడదవోలు, రాజమహేంద్రవరంలలో జనసేన నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.నిడదవోలు,కొవ్వూరు, గోపాలపురం నియోజక వర్గాల సమావేశాన్ని నిడదవోలులో,రాజమండ్రి సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి నియోజక వర్గాల సమావేశాన్ని రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో నిర్వహించారు.అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యంత మెజార్టీతో గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ప్రతి జనసైనికుడు 50 మంది పట్టభద్రులతో రాజశేఖర్‌కు ఓట్లు వేయించాలన్నారు. ఎన్నికల కోడ్ పూర్తికాగానే డీఎస్సీ కూడా నిర్వహిస్తారన్నారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి జిల్లా అంతటా ప్రచారం చేస్తారని తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కూటమి మీద నమ్మకంతో ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 3,13,261 ఓట్లు ఉన్నాయన్నారు. ఓటు వేసి గెలిపిస్తే పట్టభద్రులకు అండగా ఉంటానన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని ఇప్పటికే రాజశేఖర్ కలిసి మద్దతు కోరారు. త్వరలో జిల్లా స్థాయిలో బీజేపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. మాజీ మంత్రి కెఎస్ జవహర్ ఇతర నేతలు ప్రచారం చేస్తున్నారు. సమావేశంలో జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, అనపర్తి ఇన్‌చార్జి మారెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి నగర్ అధ్యక్షుడు వై.శ్రీను,గంటా స్వరూప,గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వేమన నారాయణ గౌడ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి ప్రియా సౌజన్య, బార్లపూడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

15 ఓపెన్ ర్యాంపుల్లో రేపటి నుంచి ఇసుక తీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఫోర్త్ బ్రిడ్జికి అవతల ఉన్న కాతేరు, అరికిరేవుల, తాళ్లపూడి ప్రాంతాల్లోని 15 ఓపెన్ రీచ్‌లను బుధవారం నుంచి ప్రారంభించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం కలెక్టర్ ప్రశాంతి ప్రస్తుతం జిల్లాలో ఇసుక తవ్వకాల పరిస్థితిపై సమీక్షించారు.మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీ ఆమోదం పొందిన ఇసుక ర్యాంపులన్నింటినీ బుధవారం నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. అందులో కాతేరు,అరికిరేవుల, తాళ్లపూడి తదితర ప్రాంతాల్లోని 15 ర్యాంపులు ఉన్నాయి. వీటి ద్వారా 4.2 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమవుతుందన్నారు. ఇప్పటికే పనిచేస్తున్న ర్యాంపుల్లో 8,62,719 టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. చట్టబద్ధమైన ర్యాంపుల్లో ఈ నెల 11 నుంచి 13 వరకూ పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నామని, వాటితో మరో 57,82,950 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యం అవుతుందని చెప్పారు. జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీవో కృష్ణనాయక్, ఏడీ మైన్స్ డి.ఫణి భూషణరెడ్డి పాల్గొన్నారు.

గీత కులాల మద్యం షాపుల దరఖాస్తు గడువు రేపే

రాజమహేంద్రవరం/నిడదవోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గీతకులాల వారికి 10శాతం మద్యం షాపులను ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం జిల్లాలో 11 షాపులు శెట్టిబలిజ, గౌడ్, గౌడలకు ఒక్కోటి చొప్పున మొత్తం 13 షాపులు కేటాయించారు.ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5గంటల లోపుగా దరఖాస్తులు సమర్పించాలని అధికారులు తెలిపారు.దరఖాస్తుదారులు ప్రభుత్వం నిర్ణయించిన రూ.2లక్షల నాన్ రిఫండబుల్ రుసుంను డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ రాజమండ్రి తూర్పుగోదావరి జిల్లా పేరున డీడీ తీసి దరఖాస్తుతో పాటు స్థానిక ఎక్సయిజ్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు.



ఖాళీ..రైలు!

రైల్వే బడ్జెట్‌లో నిరాశే

నిర్మలమ్మ పద్దు జిల్లాలోని రైల్వేకి నిరాశను మిగిల్చింది. గతంలో ఇచ్చిన కేటాయింపులనే ఇప్పుడు మళ్లీ కొత్తగా ప్రకటించడంపై గోదావరి వాసులు విస్తుపోతున్నారు. పుష్కరాలకు ఇంకో రెండేళ్ల సమయం మాత్రమే ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కొత్త లైన్లు గానీ, కొత్త రైళ్లు గానీ లేవు. వందేభారత్ రైళ్లనే తెరపై చూపిస్తూ సామాన్యుల ప్రయాణ పాట్లను పక్కన పెట్టేశారు. మొత్తానికి కేంద్రం, రాష్ట్రంలో మంచి పరిచయాలున్నా, పురందేశ్వరి ఎంపీగా ఉన్నా ఉమ్మడి జిల్లాకు ఈ బడ్జెట్‌లో ఏమీ ఒరగకపోవడంపై విమర్శలు వినవస్తున్నాయి. రాయితీల ఊసూ లేదు..

- నాటి అమృత్ నిధులే.. కొత్తగా..
- బడ్జెట్‌లోనూ ఆ రూ.270 కోట్లే
- పుష్కరాల నిధులపై క్లారిటీ నిల్
- గతంలో ఇచ్చినవే కొత్తగా చెప్పిన వైనం
- కడియం-నిడదవోలు లైన్‌కు నిధులేవి!
- కొవ్వూరు,అనపర్తిలో హాల్ట్‌ల ఊసేలేదు
- వృద్ధులు, జర్నలిస్టుల రాయితీ మరిచారు
- బడ్జెట్‌లో రైల్వే నిధులపై పెదవి విరుపు
- సామర్లకోటకు కేటాయింపుల్లేవ్

రాజమహేంద్రవరం/సామర్లకోట,ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి): అంతా పాతే.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన రైల్వేస్టేషన్లకు కొత్త కేటాయింపులు లేకపోవడంతో రైల్వే బడ్జెట్ నిరాశమిగిల్చింది.2027లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఖచ్చితంగా కేటాయింపులు ఉంటాయని అంతా ఆశించారు.అయితే ఏమీ లేకపోవడంపై పెదవి విరుస్తున్నారు. కేంద్ర రైల్వే బడ్జెట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రైల్వేస్టేషన్ల అభివృద్ధికి తాజాగా నిధులేమీ కేటాయించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిలిపివేస్తున్న పలు రైళ్లను యథాతథంగా నడిపేందుకు తాజాగా రైల్వే ఏ కీలక నిర్ణయం తీసుకోలేదు.

ఇప్పటికే అధికం

రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు ఇప్పటికే సామర్థ్యానికి మించి రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. గూడ్స్ రైళ్లతో కలిపి 200 రైళ్ల పరుగులు పెడుతున్నాయి. దీంతో ఒక రైలుకు, మరో రైలుకు మధ్య ప్రయాణ నిడివి బాగా తగ్గిపోయింది. ఈ క్రమంలో పుష్కరాలకు కొత్త రైళ్లు వేస్తే వాటిని ఎలా నడిపిస్తారో చూడాల్సి ఉంది. ఆర్చ్ బ్రిడ్జి నిర్మించిన సమయంలో పక్కనే మరో వంతెన నిర్మాణానికి అనువుగా స్పాన్ (స్తంభాలు)లలో ప్రొవిజన్ పెట్టారు. అంటే ఇప్పుడు వంతెన నిర్మిస్తే సరిపోతుంది. స్పాన్‌లు నిర్మించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఉన్న ఆర్‌సీఆర్‌బీ,ఆర్చ్ బ్రిడ్జిలపై ట్రాఫిక్ దృష్ట్యా రైళ్లను కొవ్వూరులో లేదా ఔటర్‌లో కొద్ది సేపు నిలపడం చేస్తున్నారు. దీంతో ఆర్చ్ బ్రిడ్జిపై వంతెన నిర్మాణమైతే చాలా ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా కడియం నుంచి నిడదవోలు వరకూ లైను వేయడం ద్వారా గూడ్స్ రైళ్లను మళ్లించడం ద్వారా రాజమండ్రి స్టేషనుపై ఒత్తిడి తగ్గించవచ్చనే ఆలోచన చేస్తున్నారు.ఈ లైను విషయం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. దీని నిధుల విషయం కూడా బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. నిడదవోలు రైల్వేస్టేషన్‌లో 1.5 కిలోమీటర్ల లూప్ లైను నిర్మిస్తున్నామని మాత్రం చెప్పారు.

నాటి అమృతమే.. నేడేం లేదు..

ఆంధ్ర ప్రదేశ్‌లోని అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి పథకంలో 72 ప్రధాన రైల్వేస్టేషన్లను రూ.3,141 కోట్ల మేర నిధులతో అభివృద్ధి చేసేందుకు గతేడాది ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు సుమారు రూ.271 కోట్లు, సామర్లకోట స్టేషన్‌కు రూ.15.13 కోట్లు కేటాయించారు. ప్రస్తుత రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులు భారీగా ఉంటాయని ఆశించారు. ఏమీ లేకపోవడంపై ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిడదవోలుజంక్షన్, కొవ్వూరు, రాజమహేంద్రవరం,కడియం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, కాకినాడ, పిఠాపురం, అన్నవరం తుని వంటి స్టేషన్లు ఉన్నా కనీసం పట్టించే లేదు.రాజమహేంద్రవరం,సామర్లకోట వంటి ప్రధాన రైల్వే స్టేషన్లలోనూ అమృత్ అభివృద్ధి పనుల్లో వేగం లేదు..

పుష్కరాలకు నిధుల్లేవ్..

కుంభమేళాకి ప్రయాగ్‌రాజ్.. గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం. 2027లో పుష్కరాలు జరగనున్నాయి.ఈ మేరకు ఇప్పటి నుంచీ నిధులు సమకూరితే తప్ప ప్రయోజనం ఉండదు.ఈ బడ్జెట్‌లో పుష్కరాలకు నిధుల కేటాయిస్తారని గోదావరి జనం ఆశించారు.కానీ అమృత్ భారత్ కింద రాజమహేంద్రవరం,నిడదవోలు,సామర్లకోట రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని మాత్రమే పేర్కొన్నారు.ఇప్పటికే రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు రూ.271 కోట్లు కేటాయించారు. పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి.దీన్నే కొత్తగా ఇచ్చినట్లు చూపించడం విస్మయానికి గురిచేస్తోంది. రాజమహేంద్రవరం ఎంపీగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉన్నా కేటాయింపులు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.ఇక కొవ్వూరు-సత్తుపల్లి రైల్వే లైను గురించి ప్రస్తావన లేకపోగా..కరోనా సమయంలో కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో రైళ్ల హాల్ట్ నిలుపుదల చేశారు.అదే సమయంలో వృద్ధులకు,జర్నలిస్టులకు రైలు ప్రయాణాల్లో ఇచ్చే రాయితీని తీసేశారు.ఈ సారి బడ్జెట్‌లో వీటి పునరుద్ధరణపై ప్రకటన వెలువడుందని ఆశించినా నిరాశే మిగిలింది. రాజమహేంద్రవరం నుంచి బెంగళూరు,భువనేశ్వర్‌లకు రెండు వందేభారత్ రైళ్లను గతంలోనే ప్రకటించారు. ప్రస్తుతం వాటి నిమిత్తం రాజమహేంద్రవరం మెము కార్ షెడ్‌లో పనులు జరుగుతున్నాయి.ఇవి కాకుండా హైదరాబాద్, బెంగళూరు,భువనేశ్వర్‌లకు సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రాజమండ్రి నుంచి బయలుదేరే విధంగా నడపాలనే డిమాండ్ ఉన్నా నిరాశే మిగిలింది.

గోదావరి స్టేషన్‌ను వదిలేశారా?

రాజమహేంద్రవరంలో గోదావరి రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. పుష్కరాల సమయంలో ఈ రైల్వే స్టేషను రద్దీలో భాగం పంచుకుంది.ఈ రైల్వేస్టేషను పుష్కర, కోటిలింగాల ఘాట్లకు దగ్గరగా ఉండడంతో ఎక్కువ మంది జనం ఈ రైల్వేస్టేషనులోనే దిగుతారు. పైగా సాధారణ రోజుల్లో కూడా ఇక్కడ రైళ్లను ఆపాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.ఈ రైల్వేస్టేషన్‌ని పుష్కరాలనాటికి అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఇలా రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి నిధులనే బడ్జెట్‌లో చూపించి సరిపెట్టుకోమనడంతో బడ్జెట్‌పై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

ఆర్వోబీలు, ఆర్‌యూబీలు ఎక్కడ?

రైల్వేగేట్లవద్ద ప్రమాదాలను శాశ్వతంగా నివారించేందుకు, ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు 2027 నాటికి అన్ని రైలు గేట్లను తొలగిస్తామన్న రైల్వే గతంలో చేసిన ప్రకటన నేడు ప్రచారంలో లేకపోవడం విచారకరం. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో గూడూరు నుంచి అనకాపల్లి స్టేషన్ల మధ్య 390 రైలు గేట్లు ఉన్నట్టు గతంలోనే రైల్వే అధికారులు గుర్తించారు.వీటిని తొలగించి ఆర్‌యూబీలు, ఆర్వోబీలు నిర్మిస్తామన్నారు.వీటికోసం రూ.2,400 కోట్ల మేర నిధులు ప్రతిపాదించారు.ప్రస్తుత బడ్జెట్‌లో వీటి నిర్మాణాలకు నిధులు కేటాయింపులు లేకపోవడంపై రైల్వే అధికారులు ఖంగుతిన్నారు.



సాగర సంగమ తీరాన కోరిన కోరికలు తీర్చే భక్తజన వరదుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి. ఆ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు 4వ తేదీ మంగళవారం రథసప్తమి పర్వదినాన ప్రారంభమవుతాయి. మంగళవారం నుంచి పది రోజుల పాటు స్వామివారి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముగింపులో అంతర్వేది ఆలయ ఉత్తర భాగంలో ఏర్పాటు చేసిన చెరువులో హంస వాహనంపై స్వామి-అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

● (అంతర్వేది/ఆంధ్రజ్యోతి)

చూసొద్దాం రండి
అంతర్వేది వైభవం



నేడు స్వామి వారు పెండ్లికొడుకాయెనే..

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులు సంయుక్త నిర్వహణలో మంగళవారం ఉదయం నుంచి అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా రథసప్తమి రోజున ఈ రెండు కుటుంబాల వారిచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నసమారాధన జరుగుతుంది. బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే స్వామివారికి మధుపర్కములు సమర్పించి మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరిస్తారు. స్వామి-అమ్మవార్లకు ఆలయ అర్చకులు, వేద పండితుల సారథ్యంలో ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాలకు లక్షలసంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.



నేటి నుంచి స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు

అంతర్వేదిలో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు

మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ

పది రోజుల పాటు ఘనంగా జరగనున్న ఉత్సవాలు





విద్యుత్ దీపాలంకరణ

అంతర్వేదికి ఇలా రావొచ్చు..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి అంతర్వేది చేరుకునే భక్తులు రావులపాలెం, రాజోలు మీదుగా రావాల్సి ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చే భక్తులు పాలకొల్లు, దిండి-చించినాడ వంతెన మీదుగా శివకోడు, మలికిపురం మీదుగా రావచ్చు.



ఉత్సవ ఏర్పాట్లను వివరిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



భారీ బందోబస్తు

స్వామివారి ఉత్సవాల్లో ముఖ్య భూమిక పోషించే పోలీసులు, బందోబస్తు మరింత పటిష్ఠంగా ఏర్పాటు చేయనున్నారు. వెయ్యి మంది పోలీసు సిబ్బందితో 9 సెక్టార్లుగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఒక ఎస్పీ, ఒక అడిషనల్ ఎస్పీ, 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలతో ఉత్సవాల్లో బందోబస్తు నిర్వహించనున్నారు. ఉత్సవాల ప్రధాన రోజుల్లో 20 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ జరుగుతుంది. ఎన్డీఆర్ఎఫ్, స్పెషల పార్టీ, మెరైన్ పార్టీలతో పర్యవేక్షణ, 100 సీసీ కెమెరాల ఏర్పాటు, డిజిటల్ డిస్‌ప్లే, 12 ఎల్ఈడీ స్ర్కీన్లతో భక్తులకు స్వామివారి కల్యాణం తిలకించే అవకాశం. క్యూలైన్లలో పటిష్ఠమైన బారికేడింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఆరు ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు. కల్యాణం అనంతరం భక్తులకు అక్షింతల పంపిణీ జరుగుతుంది.

పెంచిన ఆర్టీసీ బస్సు సర్వీసులు

లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల సందర్భంగా ఆర్టీసీ అమలాపురం, రాజోలు, రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, పాలకొల్లు డిపోల నుంచి 105 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. కల్యాణోత్సవాలకు బస్సులను సిద్ధం చేశామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అంతర్వేదికి రాజోలు నుంచి 31 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం నుంచి 104, అమలాపురం నుంచి 63, కాకినాడ నుంచి 118 కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి 41 కిలోమీటర్లు, భీమవరం నుంచి 64 కిలోమీటర్లు.

4 లక్షల మంది వస్తారని అంచనా..

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేవాదిదేవుడైన శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. స్వామివారి ఆలయంలో సోమవారం విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసి మీడియాకు ఉత్సవాల ఏర్పాట్ల గురించి తెలిపారు. ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అంతర్వేది పుణ్యక్షేత్రానికి స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు సుమారు 4లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. ఫిబ్రవరి 4 నుంచి 13వ తేదీ వరకు దివ్యతిరు కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, కూటమి ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తూ 7న జరిగే కల్యాణం, 8న రథోత్సవం, 12న చక్రస్నానం, 13న జరిగే తెప్పోత్సవాల కార్యక్రమాలకు ఉన్నతాధికారులను నియమించినట్టు తెలిపారు. ప్రధానంగా ఆలయానికి చేరుకునే రహదారులను ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.22.31 కోట్ల నిధులతో ఎనిమిది పనులు చేపట్టామన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.22.30 లక్షల నిధులతో మూడు పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాబహదూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, కొప్పుల ఫణికుమార్, ముప్పర్తి నాని, బైరా నాగరాజు, పొన్నాల ప్రభ, పిండి సత్యనారాయణ, పోతురాజు కిశోర్, రావూరి నాగు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రాంగణంలో అత్తిలి వారిచే పవన్‌వైష్ణవ కోలాట భజన మండలి ప్రదర్శన, 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు కేరళ వాయిద్యాలతో స్వామివారి గ్రామోత్సవం. 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగర సంకీర్తనతో స్వామివారి గ్రామోత్సవం. 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సుమారు 500 మంది మహిళా భక్తులచే లలితాసహస్ర పారాయణం. 10వ తేదీ రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ సురభి వారిచే స్వామివారి కల్యాణోత్సవ ప్రాంగణంలో మాయాబజార్ నాటకం, 11వ తేదీ రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ సురభి వారిచే భక్త ప్రహ్లాద నాటకం జరుగుతాయి.

సత్రాల్లో ఉచిత భోజనం

తీర్థ మహోత్సవాలకు వచ్చే భక్తులకు 60 సత్రాల ద్వారా ఉచిత భోజన సదుపాయం అందిస్తారు. 7, 8, 12, 13 తేదీలతో పాటు ప్రధానంగా 8న సుమారు 2లక్షల మంది భక్తులకు సత్రాల్లో అన్నసమారాధన జరుగుతుంది. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం రాజోలు డిపో నుంచి 40 బస్సులు, ఇతర డిపోల నుంచి 65 బస్సులు మొత్తం 105 బస్సు సర్వీసులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరాల ఏర్పాటు

శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవాల్లో ఐదు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం లోపల, బయట. అటుకుల మండపం వద్ద ఎంపీపీ స్కూలులో, బస్టాండు, యాత్రికుల షెడ్డు, బీచ్ ప్రదేశాల్లో శిబిరాలు జరుగుతాయి. 108 వాహనాలు 3, 104 వాహనం 1, 26 మంది మెడికల్ సిబ్బంది, 85 మంది పారా మెడికల్ సిబ్బందితో మొత్తం 111 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎవరికి ఎటువంటి సమస్యలున్నా శిబిరాలకు రావాలని అధికారులు కోరారు.



వెండి కవచ అలంకరణలో శ్రీరంగనాయకస్వామి

శ్రీరంగనాయక స్వామికి 6.129 కిలోల
వెండి కవచం బహూకరణ

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలోని ఉపాలయంలో గల శ్రీరంగనాయకస్వామికి తెనాలికి చెందిన ఆలపర్తి పవన్‌కుమార్-జాహ్నవి దంపతులు, కుటుంబ సభ్యులు 6.129 కిలోల వెండి కవచాన్ని బహూకరించారు. తొలుత కవచానికి ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యుడు వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ జరిపి రంగనాయకస్వామికి అలంకరించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాబహదూర్, ప్రముఖ సినీ నిర్మాత డీవీవీ దానయ్య, ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వెండి కవచాన్ని బహూకరిస్తున్న పవన్‌కుమార్-జాహ్నవి దంపతులు

మనుమరాలి అక్షరాభ్యాసంలో సినీ నిర్మాత డీవీవీ దానయ్య

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం అధిక సంఖ్యలో అక్షరాభ్యాసాలు జరిగాయి. తన మనుమరాలితో అక్షరాభ్యాసం చేయించడానికి వచ్చిన ప్రముఖ సినీ నిర్మాత డీవీవీ దానయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఓజీ' సినిమాను వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామన్నారు. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ అలరించే విందు భోజనంలా ఉంటుందన్నారు. ఓజీ సినిమా పూర్తియిన తర్వాత మరికొన్ని ప్రాజెక్టులను తెరపైకి తీసుకువచ్చే ఆలోచన ఉందని చెప్పారు.





అయినవిల్లిలో ప్రత్యేక అలంకరణలో సరస్వతీ దేవి, చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

అయినవిల్లిలో వేడుకగా శ్రీపంచమి

అయినవిల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి పుణ్యక్షేత్రంలో వసంత పంచమి (శ్రీపంచమి)ని సోమవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ జరిపి సిద్ధివినాయకుని చెంత కలాలను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసిద్ధివినాయక స్వామి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయిస్తే విద్యాభివృద్ధికి ఆటంకాలు ఉండవని భక్తుల విశ్వాసం. దీంతో అక్షరాభ్యాసాల కోసం పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. అధికారుల అంచనాలకు మించి భక్తులు సుదూర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారులతో పలకలపై 'ఓం నమః శివాయ నమః సిద్ధం నమః' అని తల్లిదండ్రులు, అర్చకస్వాములు, వేదపండితులు రాయించారు. భక్తులకు ఆలయ సహాయ కమిషనరు ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సేవలందించారు. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సోమవారం ఒక్కరోజు వివిధ సేవల ద్వారా రూ.6,13,639 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనరు సత్యనారాయణరాజు చెప్పారు.

శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయంలో
సరస్వతి, కలాల పూజ



అయినవిల్లిలో సిద్ది వినాయకస్వామికి జరిగిన కలాల పూజ



వసంతి పంచమి సందర్భంగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ప్రత్యేక అలంకరణలో లలితా అమ్మవారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలోని ఓ ప్రైవేటు స్కూలులో సరస్వతీదేవికి విద్యార్థినుల నృత్య నీరాజనం



తూర్పు గోదావరి జిల్లా చాగల్లులో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

నాటు 'గుడ్డు'

- పడిపోయిన గుడ్డు ధర
- పేపర్ ధర రూ.4.90పైసలు, కమింగ్ రేట్ రూ.4.37పైసలు
- కమీషన్లు పోను రైతుకు మిగిలేది రూ. 4.12పైసలే
- ధరలు ఇలా ఉంటే పౌల్ట్రీ పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకం



అనపర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడికి తక్కువ ధరకు లభ్యమయ్యే పౌష్టికాహారంలో ముందు వరుసలో నిలిచేది కోడి గుడ్డు అనేది జగమెరిగిన సత్యం. అయితే మొన్నటి వరకు పౌల్ట్రీ రైతులు రారాజులుగా ఉంటే గత ఐదేళ్లగా పరిశ్రమ మనుగడ కష్టతరంగా మారింది. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగాను వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఫీడ్ ధరలతో కోళ్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనికి తోడు మందుల రేట్లు, విద్యుత్ ధరలు, ఇలా ప్రతీదీ పెరిగిపోవడం గుడ్డు ధర మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండటంతో కోళ్ళ పరిశ్రమ నష్టాల బాట పట్టింది. గతంలో టన్ను మేత ధర రూ.15వేల నుంచి రూ.30వేల వరకు ఉంటే ప్రస్తుతం మేత ధర టన్ను రూ.30 వేలకు పైబడి ఉంది. ఏడాదిలో సగం రోజులు గిట్టుబాటు ధర పలికేది. కానీ ప్రస్తుతం గిట్టుబాటు ధర రెండు నెలలు కూడా ఉండకపోవడంతో మిగిలిన పది నెలలు నష్టాల ఊబిలో కూరుపోవాల్సి వస్తుంది. ఇతర రాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమ అభివృద్ధి చెందడం అక్కడి ప్రభుత్వాలు పౌల్ట్రీ రైతులకు రాయితీలు కల్పించడం ఏపీ లో మాత్రం ఎటువంటి రాయితీలు లేకపోవడంతో రైతులు నష్టాల బాట పట్టాల్సి వస్తుంది. చలికాలం ప్రారంభం నుంచి కొత్త ఏడాది ప్రారంభం వరకు సుమారు నెల 15రోజుల పాటు రూ.6పైబడి పలికిన గుడ్డు ధర ప్రస్తుతం రూ.4.90పైసలకు పడిపోయింది. ప్రస్తుతం ఉన్న ఫీడ్ ధరల ప్రకారం ఒక గుడ్డుకు రూ.5 వరకు ఖర్చవుతుందని, కేవలం 45రోజులు మాత్రమే ఆరు రూపాయిల వరకు పలికి ప్రస్తుత ధర పడిపోయిందని రైతులు వాపోతున్నారు. పేపర్ ధర రూ.4.90 ఉన్నప్పటికీ ఎగుమతుల వద్ద డిమాండ్ లేకపోవడంతో ట్రేడర్లు కమింగ్ రేటుకు మాత్రమే ప్యాకింగ్‌లు చేయడంతో ప్రస్తుతం రైతులకు రూ.4.37పైసలను అందిస్తుండగా దీనిలో ట్రేడర్లు కమిషన్ రూ.0.25పైసలు పోవడంతో ఇక రైతుకు రూ.4.12పైసలు మాత్రమే మిగిలుతుంది. రానున్న రోజులు ఈ ధర మరింత పతనమయ్యే పరిస్థితులు ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉభయ గోదావరి జిల్లాల్లో...

ఉభయ గోదావరి జిల్లాల్లో రోజుకు కోటిన్నర గుడ్లు ఉత్పత్తి కావడంతో రైతులు రోజుకు కోటి నుంచి కోటిన్నర వరకు నష్టపోయే పరస్థితి ఏర్పడింది. లక్ష కోళ్లు ఉన్న పరిశ్రమలో సుమారు 70వేల గుడ్లు దిగుబడి ఉన్నా రోజుకు లక్ష నుంచి లక్షన్నర మేర రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. 2014 ఎన్నికల్లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కోళ్ల పరిశ్రమపై కొన్ని రాయితీలు ప్రకటించింది. దీంతో ఆ ఐదేళ్ల పాటు రైతులు నష్టాల బారిన పడినా కొంతమేర ఊరట చెందారు. కానీ తరువాత 2019లో వచ్చి న వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పౌల్ట్రీ రంగం వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదని కరోనా విపత్కర పరిస్థితిలో కూడా పరిశ్రమ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేశామని కానీ ప్రభుత్వం మాత్రం మావైపు చూడలేదని కొందరు పౌల్ట్రీ పెద్దలు వాపోతున్నా రు. వచ్చేది వేసవి కాలం కావడంతో పరిశ్రమలో ఖర్చులు మరింత పెరుగుతాయని కోళ్లను కాపాడుకునేందుకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని, ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం పౌల్ట్రీ రంగ ంపై దృష్టి సారించి కోళ్ల మేతకు అవసరమైన నూకలు, మొక్కజొన్నలతో పాటు విద్యుత్ చార్జీల పైనా రాయితీలు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

తొలిరోజు ఒక నామినేషన్

ఈ నెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ.. 8, 9 తేదీలు సెలవు



ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రాజేంద్ర

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు నామి నేషన్ల స్వీకరణ తొలిరోజు సోమవారం ఒక నామినేషన్ దాఖలైంది. కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి పేపకాయల రాజేంద్ర ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. అభ్యర్థి రాజేంద్రతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సోమవారం నామినేషన్ల స్వీకరణ చేపట్టగా ఈనెల 10 వరకు గడువు ఉంది. మధ్యలో ఈనెల 8, 9 తేదీలు సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 11న పరిశీలన, 13న మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంది. 27 ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. మార్చి 3న ఏలూరులో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికలకు 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 3,15,261 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి: ఆర్వో

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 3,15,261 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఇప్పటివరకు అందిన 8,501 క్లెయిమ్‌లు పరిశీలించి 5వతేదీలోపు ఈఆర్‌వో నెట్‌లో అప్‌డేట్ చేస్తామని ఆయన తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో వివాహిత ఆత్మహత్య

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కాకినాడ రాగంపేటలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు రాగంపేటకు చెందిన వి.ఈశ్వర్, శిరీష రత్నప్రశాంతి (30) భార్యాభర్తలు. వారు ప్రే మించుకుని 2016లో వివాహం చేసుకున్నారు. వారికి 8ఏళ్ల బాబు ఉన్నాడు. వ్యక్తిగత కారణాలతో శిరీష రత్నప్రశాంతి సోమవారం మధ్యాహ్నం ఇంట్లో గదిలోకెళ్లి ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అది గమనించిన భర్త కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

వరకట్న వేధింపులే కారణం



మరణించిన బేబీరాణి

గొల్లప్రోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన శివకోటి బేబీరాణి (34), రాజులకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. బేబీరాణిని అదనపు కట్నం తీసుకురావాలని భర్త రాజు, అత్త ధనలక్ష్మీ, మరిది శ్రీనులు వేధించడమే గాక శారీరకంగా, మానసికంగా హింసించేవారు. దీంతో ఆమె జనవరి 20న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బేబీరాణిని ఆమె తల్లి దడాల రమణ పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. తల్లి ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపులు, ఆత్మహత్య ప్రేరణ కింద కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఒంటిమామిడిలో..

పోలీసు బందోబస్తు నడుమ కొనసాగిన పైప్‌లైన్ పనులు

తొండంగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడిలో దివీస్ ఫార్మా పైప్‌లైన్ పనులు పోలీసు బందోబస్తు నడుమ సోమవారం కూడా కొనసాగాయి. ఆదివారం ఉదయం నుంచీ డీసాలినేషన్ పైప్‌లైన్‌ను సముద్రంలోకి వేస్తున్నారు. రెండో రోజు ముందు జాగ్రత్త చర్యగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దివీస్ ఫార్మా గేటు వద్ద టెంట్ వేసి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మరికొంత మంది పైప్‌లైన్ వేసే ప్రాంతంలో ఉన్నారు. సముద్రం నీటిని పైపులైన్ ద్వారా ఫ్యాక్టరీకి తరలించి నీటిని శుద్ధి చేసి మంచి నీటిని ఫ్యాక్టరీ అవసరాలకు వినియోగించే నిమిత్తం వేసే పైపులైన్‌గా దీనిని పేర్కొంటున్నారు. మరోవైపు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ టీడీపీ మత్స్యకార విభాగం జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణ, నేతలు చొక్కా కాశీశ్వరరావు, చొక్కా అప్పారావు, గంటా లక్ష్మణ్, మహంకాళి కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లారు.

అవగాహనతో కేన్సర్‌కు అడ్డుకట్ట!

ప్రారంభదశలో గుర్తిస్తే వైద్యసేవలతో సత్ఫలితాలు

రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌లో ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ సేవలు

నేడు కేన్సర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం



రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మారిన ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వంశపార్యంపర్య కారణాలతో కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నదని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు కేన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం మరింత ప్రమాదకరంగా పరిణమిస్తోంది. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే రేడియేషన్, కీమోథెరపీ ద్వారా చాలా వరకూ విస్తరించకుండా నివారించే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అయితే కేన్సర్‌పై ప్రజల్లో చైతన్యం రాకపోవడం ప్రాణాపాయ పరిస్థితుల్లోకి నెడుతున్నదని, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా జరుగుతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా నివారణకు సూచనలు ఇలా..

స్ర్కీనింగ్ అత్యంత ముఖ్యం

కేన్సర్ వ్యాధి నివారణలో స్ర్కీనింగ్ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది. నివారణకు అవకాశం ఉన్న కేన్సర్లు అయిన రొమ్ము కేన్సర్, సర్వికల్ కేన్సర్, నోటి కేన్సర్‌లను ప్రారంభదశలోనే గుర్తించడం ద్వారా చాలా వరకూ నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అలాగే సేవల సమీకరణ జరగాల్సి ఉంటుంది. కమ్యూనిటీ స్థాయిలో ఎన్‌సీడీ 3.0 యాప్ ద్వారా ఆశా, ఏఎన్ఎంల సహకారంతో అనుమానిత వ్యక్తులను గుర్తించి అందుబాటులోని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు పంపించడం ద్వారా సత్ఫలితాలు పొందే అవకాశం ఉంది. వీటితోపాటు కౌన్సెలింగ్, చికిత్స కౌన్సెలింగ్ ద్వారా నిర్ధారణ, అవసరమైన చికిత్సా సేవలను సమగ్రంగా అందించగలుగుతారు. వీటికితోడు ప్రజల్లో కేన్సర్‌పై అవగాహన పెరగాల్సి ఉంటుంది.

జీటీజీహెచ్‌లో ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్)లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌లో కేన్సర్‌కు సంబంధించి పలు రకాలైన వైద్యచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ సర్జరీ, కీమో థెరపీ సేవలు లభిస్తున్నాయి. తల, మెడ సంబంధిత కేన్సర్‌లతోపాటు గైనిక్ సంబంధిత కేన్సర్లు, గ్యాస్ట్రో ఇంటెస్టియల్ కేన్సర్లు, స్కిన్ కేన్సర్లు వంటి వాటికి సర్జరీలు చేస్తున్నారు. వీటితోపాటు కీమో థెరపీ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌లో డాక్టర్ ప్రశాంత్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తుండగా, ఒక గైనకాలజిస్ట్, ఒక రేడియేషన్ ఆంకాలజిస్ట్, సర్జికల్ ఆంకాలజిస్ట్, ఈఎన్‌టీ స్పెషలిస్టు, శస్త్ర చికిత్స నిపుణురాలు అందుబాటులో ఉన్నారు. ప్రతి మంగళవారం, గురువారం జీటీజీహెచ్ ఓపీ బ్లాకులోని 222 నెంబరు గదిలో ముందస్తు కేన్సర్ నిరోధక సేవల ఓపీ నిర్వహిస్తున్నారు.

ప్రజల్లో అవగాహన పెరగాలి

కేన్సర్ పట్ల గ్రామీణ ప్రాంతాల వారితో పాటు పట్టణవాసుల్లోనూ పెద్ద అవగాహన లేకపోవడంతో కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి. పొగాకు నమలడం, ధూమపానం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడంతో పాటు మంచి ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్‌కు దూరంగా ఉండవచ్చని జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ పేర్కొన్నారు.

నేడు కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరంలో మెగా పబ్లిక్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్ నుంచి ఈ ర్యాలీ ప్రారంభమవుతుంది. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

మంచు మింగేసింది!

బైక్‌ను ఢీకొన్న వ్యాన్

ద్విచక్ర వాహనదారుడి తల పై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో యువకుడి మృతి



తానేటి హరిశ్చంద్ర ప్రసాద్‌బాబు(ఫైల్)

నల్లజర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పొగ మంచు ఓ నిండు ప్రాణాన్ని బలి గొంది. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని ఓ వ్యాన్ ఢీకొనడంతో కిందపడిపోయిన ఆ వాహనదారుడి తల పైనుంచి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా పోతవరం పాతపేటకు చెందిన తానేటి ప్రసాద్, భూలక్ష్మి దంపతులకు హరిశ్చంద్రప్రసాద్‌బాబు (24), కృష్ణబాబు, మమత సంతానం. ప్రసాద్‌కు ఆరు నెలల క్రితం నబీపేటకు చెందిన చిన్నారితో వివాహమైంది. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. ప్రసాద్ జంగారెడ్డిగూడెంలోని ఓ సెల్‌ఫోన్ షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై పోతవరం నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్తుండగా షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కొయ్యలగూడెం నుంచి నల్లజర్ల వైపు ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వ్యాన్ ఢీకొంది. దీంతో ప్రసాద్ కింద పడిపోయాడు. ఆ సమయంలో నల్లజర్ల నుంచి కొయ్యలగూడెం వైపు వెనుక వస్తున్న ట్రాక్టర్ అతని తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడిక్కక్కడే మృతిచెందాడు. మంచు ప్రభావంతో డ్రైవర్లకు కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసు పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏ ఎస్‌ఐ మోహన్ రావు తెలిపారు.



ఘటనా స్థలంలో వ్యాన్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు పల్లి రమేష్(ఫైల్)

కొత్తపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట రెడ్డప్ప వారిపేటకు చెందిన ఇద్దరు మోటార్‌సైకిల్‌పై బోడిపాలెం వైపు వెళ్తుండగా అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న లారీ ఆదివారం అర్ధరాత్రి వెనుక నుంచి ఢీకొనడంతో ద్విచక్ర వాహనం వెనుక వైపున కూర్చున్న పల్లి రమేష్(35)కు తీవ్రగాయలయ్యాయి. దీంతో అతడిని 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం రమేష్ మృతిచెందాడు. కాగా వాహనం నడుపుతున్న పల్లి వినోద్‌కు స్వల్పగాయాలయ్యాయి. రమేష్ తండ్రి చినసత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. కాగా రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెయింటింగ్ పనులు చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్న రమేష్ మృతితో ఆ కుటుంబానికి దిక్కెవరంటూ భార్య వరలక్ష్మి రోధిస్తున్న తీరు కలిచివేసింది.

మానవత్వాన్ని మరిచారు!

వృద్ధురాలిని రోడ్డుపై వదిలేశారు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు నమ్మించి పెన్షన్ ఇస్తుండగా అడ్డుకున్న యూనియన్ల ప్రతినిధులు



అమలాపురం ఆర్టీసీ డిపో ఇన్‌గేట్ ఎదుట వృద్ధురాలు బంగారమ్మ



సచివాలయ ఉద్యోగిని నిలదీస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 75 ఏళ్ల ఆ వృద్ధురాలి పేరు మద్దింశెట్టి బంగారమ్మ. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామం. మతిస్థిమితంలేని ఆమెను ఎవరో తీసుకొచ్చి కొన్ని నెలల క్రితం అమలాపురం ఆర్టీసీ డిపో ఎదుట వదిలేశారు. అప్పటి నుంచి ఆటో యూనియన్ ప్రతినిధులు, పండ్ల వర్తకులు ఆమె ఆలనా, పాలనా చూస్తున్నారు. ఏం జరిగిందో ఏమో గత కొంతకాలంగా నడవలేని స్థితిలో ఉంది. అయితే వృద్ధురాలి రక్తసంబంధీకులమని చెప్పి సోమవారం ఉదయం మందపల్లి సచివాలయ ఉద్యోగిని తీసుకుని అమలాపురం ఆర్టీసీ బస్టాండు సెంటర్‌కు వచ్చారు. ఆ వృద్ధురాలికి నడిరోడ్డుపైనే ఐరిష్ తీసుకుని పెన్షన్ సొమ్ములను అప్పగిస్తుండడాన్ని స్థానిక యూనియన్ ప్రతినిధులు గుర్తించారు. వెంటనే అడ్డుకుని వారిని నిలదీశారు. మూడు నెలలకు సంబంధించి రూ.12వేలు పెన్షన్ నగదును తీసుకున్న మహిళను స్థానికులంతా నిలదీశారు. కనీసం తిండి పెట్టడంలేదు. ఆలనా పాలనా చూడకుండా మానవత్వాన్ని విడిచిపెట్టి రోడ్డుపై వదిలేసి పెన్షన్ సొమ్ములు పట్టుకుపోతారా అని మండిపడ్డారు. దాంతో ఆ మహిళ వృద్ధురాలి సోదరినని చెప్పడంతో పాటు మీరెవరు అడ్డగించడానికని ఎదురు తిరిగింది. దాంతో వివాదం చెలరేగింది. మందపల్లి సచివాయలం నుంచి వచ్చిన ఉద్యోగిని ఆటో యూనియన్ నాయకులు నిలదీశారు. రోడ్డుపై పడి ఉన్న వృద్ధురాలి ఐరిష్ తీసుకుని పెన్షన్ ఎవరికో ఇచ్చేస్తారా, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు. వృద్ధురాలు అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని చెప్పారనడంతో వచ్చాను. 3 నెలలుగా పెన్షన్ తీసుకోకపోవడం వల్ల ఈసారి పెన్షన్ ఇవ్వకపోతే ఆమె పెన్షన్ నిలిచిపోతుందని చెప్పడంతో ఆమె సోదరితో వచ్చాను. ఆసుపత్రిలో కాకుండా రోడ్డుపై ఉన్న బంగారమ్మను చూసి మొదట పెన్షన్ ఇవ్వనని చెప్పానని ఆమె వారికి బదులిచ్చింది. ఆమె సూచన మేరకు యూనియన్ ప్రతినిధులైన మట్టపర్తి నారాయణ, కల్వకొలను బాబి మందపల్లి ఎంపీటీసీకి ఫోన్ చేసి సమాచారం అందించారు. దాంతో ఆయన సూచనల మేరకు పెన్షన్ కింద ఇచ్చిన రూ.12వేలు నగదుతో పాటు బంగారమ్మకు సంబంధించిన రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పెన్షన్‌కార్డు వంటివన్నీ ఆమె సోదరి నుంచి తీసుకున్నారు. వాటిని తమ వద్ద భద్రంగా ఉంచామని, ఆ గ్రామ పెద్దలు వచ్చిన తరువాత వాటిని పెద్దల సమక్షంలో అందజేస్తామని తిరుమనాథం బుజ్జి, చిన్నా, దంగేటి మంగరాజుతో పాటు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు తెలిపారు.

ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రార్థనలు

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



హాస్టల్‌లో ఏర్పాటు చేసిన ప్రార్థనల బ్యానర్

కొవ్వూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రార్థనలు నిర్వహించిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర వసతిగృహంలో ఆదివారం అరుణోదయ ఆరాధనల పేరుతో మత ప్రార్థనలు నిర్వహించారు. వాటిని అటుగా వెళ్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధి కంటమణి రామ్‌కుమార్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టడంతో విషయం బయటపడింది. మత ప్రార్థనలు ఇష్టం లేకపోవడంతో భవనం కిందకు వెళ్లిపోయామని విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల నుంచి సమాచారం తెలుసుకున్న వార్డెన్ హాస్టల్‌కు చేరుకుని ప్రార్థనలను నిలుపుదల చేశారు. దీనిపై హాస్టల్ అధికారి ఆర్.చిరంజీవిని ప్రశ్నించగా భవన యజమానులు ప్రార్థనలు పెట్టుకుంటామని అడిగారని, ప్రభుత్వ భవనంలో ప్రార్థనలు నిర్వహించరాదని చెప్పామని, తాను ఇంటికి, హాస్టల్ విద్యార్థులు ఆడుకోవడానికి వెళ్లిన సమయంలో భవన యజమానులు అనధికారికంగా అద్దెకు ఇచ్చిన పైఅంతస్తులో మత ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారని, సమాచారం తెలిసిన వెంటనే హాస్టల్‌కు వచ్చి ప్రార్థనలను నిలుపుదల చేయించామని పేర్కొన్నారు.

గోదావరిలో బాలిక మృతదేహం లభ్యం

తల్లి మందలించిందని ఇంటి నుంచి అదృశ్యం

కేసు నమోదు చేసిన పోలీసులు



మట్టపర్తి బేబి (ఫైల్)

మామిడికుదురు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బి.దొడ్డవరం గ్రామంలో ఆదివారం అదృశ్యమైన బాలిక మట్టపర్తి బేబి (14) మృతదేహం అప్పనపల్లి గోదావరిలో సోమవారం లభ్యమైంది. బేబి పెదపట్నంలంక జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తన స్నేహితురాలి వద్ద నుంచి బంగారు గొలుసు తీసుకుని దాన్ని మరొక స్నేహితురాలికి ఇచ్చినట్టు తల్లికి చెప్పింది. తన గొలుసు ఇవ్వమని స్నేహితురాలు తండ్రితో వచ్చి ఆ బాలికను అడగ్గా, ఇచ్చేసినట్టు వారికి బేబి చెప్పింది. సోమవారం నాటికి తన గొలుసు ఇచ్చేయాలని స్నేహితురాలు చెప్పింది. దీంతో శనివారం సాయంత్రం బేబిని తల్లి మందలించింది. ఇది జరిగిన కొద్దిసేపటికే బేబి అదృశ్యం కావడంతో బాలిక తల్లి నగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి వెనుకే గోదావరి నది ఉండడంతో అదృశ్యమైన బేబి నదిలో దూకేసి ఉంటుందని అనుమానించి ఆదివారం గాలింపు చేపట్టినప్పటికీ ఏవిధమైన ఆచూకీ తెలియలేదు. సోమవారం బాలిక మృతదేహం అప్పనపల్లిలో లభించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కాకినాడలో...

ఐటా జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి); వివిధరాష్ట్రాల క్రీడాకారులకు కాకినాడలో ఆతిథ్యం ఇవ్వడం కాకినాడ జిల్లాకు గర్వకారణమని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో సోమవారం రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా అండర్ 16 టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీవీ.రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నానాజీ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈనెల 3నుంచి 7వరకు జరిగే పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ డాక్టర్ శేషగిరి, ఆర్ఎంసీ మాజీ ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎల్.సత్యనారాయణ ఉన్నారు.



కాకినాడలో ఐటా జాతీయస్థాయి పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్ ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఈనెల 15నుంచి 28వరకు జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఏర్పాట్లను సోమవారం జేసీ రాహుల్‌మీనా పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న ఐఏస్ క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు, మైదానంలో టోర్నమెంట్ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలన్నారు. జేసీ వెంట ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎస్డీఈవో బి.శ్రీనివాసకుమార్, వివిధ శాఖాధికారులు ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ

త్వరలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్

కలెక్టర్ ప్రశాంతి



ఏపీఎన్జీవో కాలమానిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల ఉద్యోగుల సమస్యలపై త్వరలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఏపీఎన్జీవో సంఘం రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కాలమానిని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రతి నెలా ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించేవారమని కొన్ని కారణాల వల్ల ఆలస్యమవుతోందని, త్వరలో మళ్లీ ఉద్యోగుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం నగర అధ్యక్షుడు సుబ్బరావునాయుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు, నాయకులు మాధవరావు, సత్యమూర్తి, రాఘవరావు, వెంకటరావు, రమేష్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

మాల ఉద్యోగుల సంఘం సమావేశంలో నేతలు



సమావేశంలో ఐక్యత చాటుతున్న నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని జిల్లా మాల ఉద్యోగుల సంఘం నేతలు ప్రకటించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగిన మాల ఉద్యోగుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా మాల ఉద్యోగుల సంఘం ఛైర్మన్‌గా ఎల్‌వీ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా జి.కెన్నెడి బాబు, కోకన్వీనర్లుగా ఆర్‌టీసీ చిరంజీవి, జె.సత్యనారాయణ, వై.సతీష్, పి.నాగసురేష్, జల్లి ప్రసాద్, కే.విజయ్, ఎన్.వెంకట్రావు, ఏలేటి రాజారావు, ఎన్.సత్యనారాయణ, కె.దానబాబు, నక్క విజయకుమార్, కె.శ్యాంసుందర్, కోశాధికారులు జంగం సుబ్బారావు, ఎలిపే శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సైమన్ కమిషన్ వ్యతిరేక దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో సోమవారం సైమన్ కమిషన్ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైమన్ కమిషన్ డే రోజు ప్రకాశం పంతులు ప్రదర్శించిన ధైర్య సాహసాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ జి.రమణయ్య, సుబ్రహ్మణ్యేశ్వరి, కళాశాల ఛైర్మన్ జెట్టి ప్రసాదరావు, జమ్మి రామారావు, డి.సత్యనారాయణ, ఎంవీ పద్మావతి, వి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థలాలు ఇప్పించాలని వినతులు : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే ఇప్పించాలని కోరుతూ మంగళవారం నుంచి ఆయా సచివాలయాల్లో వినతులు అందజేయనున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతున్నామన్నారు.

వైద్యుల సేవలు సమాజానికి అవసరం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు అనేక రుగ్మతల నుంచి కాపాడి పునర్జన్మ ఇస్తారని హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఉప కార్యదర్శి మానస అన్నారు. అంతర్జాతీయ మహిళా డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరంలోని విశ్వనాథ్ హాస్పటల్ వైద్యురాలు డాక్టర్ శాలినిని సత్కరించారు. హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుడికి బోనాలు



వీరభద్రుడి బోనాల సందర్భంగా పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు

అనపర్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రామవరం గ్రామంలో వీరభద్రుడి బోనాల పండుగను సోమవారం ఘనంగా జరిపారు. ముందుగా ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు, కుమారుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ నల్లమిల్లి సనాతని, మూలారెడ్డి సతీమణి సత్యవతి వీరభద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు బోనాలను తలకెత్తుకుని గ్రామంలో వీరభద్రుడికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయం అభివృద్ధికి విరాళం



విరాళం ఇస్తున్న కంబాల శ్రీనివాసరావు

కోరుకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం గరగలంపాలెం రామాలయం అభివృద్ధికి విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు సోమవారం లక్ష విరాళాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి, నూతన దేవాలయాల నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు, టీడీపీ నాయకులు మామిడి అయ్యప్ప, ఇనకోటి రామన్నదొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ, కె.కల్యాణ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరి జీవితాన్ని వారే చక్కదిద్దుకోవాలి

రాజానగరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎవరి జీవితాన్ని వారే తీర్చిదిద్దుకోవాలని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. యు ఆర్ ది ఆర్కిటెక్ ఫర్ యువర్ లైఫ్ అనే సందేశాన్ని అందిస్తూ మెడికల్ కళాశాల ప్రాంగణంలో తీర్చిదిద్దిన విగ్రహాన్ని డాక్టర్ గన్ని సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రేరణ కల్పించేందుకు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. తమ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు దీన్ని రూపొందించినట్లు చెప్పారు. పలువురు ఎంబీబీఎస్, డెంటల్, ఫిజియోథెరపీ, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులు తమ లక్ష్యాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గన్ని భాస్కరరావు

నన్నయలో రేపటి నుంచి ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాలు ఈనెల 5, 6 తేదీల్లో నన్నయ విశ్వ విద్యాలయం కన్వెన్షన్ భవనంలో జరుగుతుందని టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు మల్లిభాస్కర్, ప్రధాన కార్యదర్శి మూడవతు విష్ణునాయక్, జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లా రాజకుమార్‌రెడ్డి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఆర్.సుమిత్, సుదర్శన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ విద్యార్థినీ, విద్యార్థులు, ప్రసాద్ నాయక్, చిన్న, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

అనపర్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిగ్రస్థులు మందులతోపాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకుంటారని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక అన్నారు. సోమవారం ఆసుపత్రిలో రామచంద్రపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్షయ రోగులకు పౌష్టికాహార పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జాస్తి దుర్గాప్రసాద్, జి.రామకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ముందు మరిచారా!

- హుకుంపేటలో ఆక్రమణల తొలగింపు
- గ్రామంలో తుది దశకు చేరుకున్న డ్రెయినేజీ నిర్మాణం
- ఇప్పుడు ఆక్రమణలు తొలగించడంపై ఆరోపణలు
- రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని డిమాండ్

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గాని పట్టణాల్లో గాని రోడ్లు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించి పనులు చేపట్టడంలో తప్పులేదు. కాని ఇక్కడ అలా కాదు డ్రయినేజీ నిర్మాణం పూర్తయిన తరువాత ఆక్రమణల తొలగింపు చేపట్టారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలోని హుకుంపేట పంచాయతీ పరిధి రామకృష్ణనగర్‌లో సుమారు రూ.12 లక్షల వ్యయంతో డ్రయినేజీ, రోడ్లు నిర్మించారు. పనులు చేపట్టేటప్పుడు ఇంజనీరింగ్, పంచాయతీ అధికారులు పనులకు సంబంధించి మార్కింగ్ వేసి కాంట్రాక్టరుకు అప్పగించాలి. ఇక్కడలా జరిగిందో లేదో తెలియదు గాని, కాంట్రాక్టరు పనులు మొదలుపెట్టి డ్రయినేజీ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఇంతలో ఏమయిందో తెలియదు గాని ప్రభుత్వ స్థలం ఇంకా అటు వైపు ఉందంటూ అధికారులు.. స్థానికులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రహరీలు కూలగొట్టేసారని స్థానికులు సత్తిరాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో మౌఖిక ఆదేశాల ప్రకారం కూల్చివేతలు చేపట్టామని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారని వారంటున్నారు. ఆక్రమణలు ఉంటే రోడ్డుకు ఇరువైపులా కొలతలు నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని అంతే గాని ఒకవైపే ఇలాంటి చర్యలు చేపట్టడం సబబుకాదని వాపోతున్నారు.రోడ్డుకు మరోవైపు డ్రయినేజీలను ఆక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారని వారి జోలికి పోకుండా చిన్నవాళ్లమైన తమపై అధికారులు ప్రతాపం చూపుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



కింద కొత్తగా నిర్మించిన డ్రెయినేజీ.. మరో పక్క ఆక్రమణలను తొలగింపు

ముంపు సమస్య పరిష్కారానికే

రామకృష్ణనగర్‌లో చాలాచోట్ల రోడ్లను ఆక్రమించుకొని ప్రహరీలు, షాపుల నిర్మించారు. దీంతో కనీసం నీరు పోయే మార్గం లేక రోడ్లన్నీ ముంపుకు గురవుతున్నాయి. కాంట్రాక్టరు నిర్మించిన డ్రెయిను కూడా ఆ ప్రాంతాల్లో జిగ్‌జాగ్‌గా నిర్మించారు. దీని వల్ల ముంపు సమస్య తీరదు సరికదా సమస్య మరింత పెరుగుతుం ది. డ్రయినేజీ నిర్మాణం విషయమై పలు ఫిర్యా దులు రావడంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మీదట చర్యలు చేపట్టాల్సి వచ్చింది. ప్రభుత్వ స్థలం మాత్రమే తీసుకుంటున్నాం గాని, ప్రజల సొంత జాగాలోకి వెళ్లడం లేదు. పనులు మొదలు పెట్టేటప్పుడే సంబంధిత సిబ్బంది సరిచూసుకుంటే సమస్య వచ్చేది కాదు.

-ఎంపీడీవో శ్రీనివాసరావు

నేడు కడియం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కడియం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4వ తేదీ ఉదయం 10గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కె.రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా పేరాబత్తులను గెలిపించండి: వాసు



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీగా ఒక్క అవకాశం ఇస్తే పట్టభద్రుల ప్రయోజనాలను కాపాడతారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. రాజమహేంద్రవరం 11వ డివిజన్‌లో సోమవారం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పట్టభద్రులకు కరపత్రాలను అందించారు. నిరుద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. వారి వెంట డివిజన్ పరిశీలకుడు బీవీ కృష్ణప్రసాద్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, వై.శ్రీను, పిక్కి నాగేంద్ర, మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ, ద్వారా పార్వతి సుందరి ఉన్నారు.

'పారా' సేవలు సమాజానికి ఉపయుక్తం

పారా సంస్థల సేవలు సమాజానికి ఎంతో ఉపయుక్తమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. తిలక్‌రోడ్డులో ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం పారా సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పారా సంస్థ ప్రస్తుతం విద్యా, ఆరోగ్య, మహిళ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖలతో కలిసి పనిచేస్తోందని సంస్థ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు టి.మార్టిన్ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో జాంపేట లూథరన్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.ఐజయ, హెచ్‌ఎం ఎస్.మేరి, పెరల్స్, లావణ్య, చాందిని, దివ్యశ్రుతి, ప్రకాష్, చిట్టిబాబు పాల్గొన్నారు.

జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారిగా మురళీ



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారిగా వీడీజీ మురళీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈయన విజయవాడ హెడ్ ఆఫీస్ నుంచి బదిలీపై నియమితులయ్యారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ఇంజనీరింగ్ డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ చదివిన వారికి నాస్కామ్ ఆధ్వర్యంలో జిల్లాలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఏసెండ్ ప్రోగ్రాంపై శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి గల వారు జిల్లా నైపుణ్య అభివృద్ధి వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 99888 53335, 81726 55686, 87901 18349 నెంబర్లను సంప్రదించాలని మురళీ కోరారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని పార్టీ ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం రామచంద్రపురంలో మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కృష్ణ పాల్గొన్నట్టు రాజమహేంద్రవరంలో ఆయన కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

జనసేనలో చేరికలు

రాజానగరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు స్థానిక జన సైనికుడు ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం జనసేనలో చేశారు. రాజానగరంలోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమక్షంలో వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నరేంద్రపురం గ్రామం నుంచి వైసీపీకి చెందిన పలువురు భారీ సంఖ్యలో చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వడ్డి చిన్న తదితరులు పాల్గొన్నారు.

15న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠ

రాజానగరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రావులచెరువు గట్టున నూతనంగా నెలకొల్పిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠను 15న నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. సోమవారం వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 13న గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగ సాల ప్రవేశం, పంచగవ్య ప్రాసన, రక్ష. దారణ, దీక్షధారణ, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, దేవత హోమ క్రతువులు జరుగుతాయన్నారు. 14న పునఃపూజలు, క్షీరాధివాసం, జలాధివాసం, ధాన్యాధి వాసం, ఫలాదివాసం, పుష్పాదివాసం, దేవతా హోమాలు జరుగుతాయన్నారు. 15న పునఃపూజలు, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం, పూర్ణకుంభం, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. అనంత రం ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉద యం 10.53 గంటలకు విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠను వేదపండితులతో వైభ వంగా జరుగుతుందని వారు తెలిపారు.

రేపు మినీ జాబ్‌మేళా

రాజానగరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, జిల్లా ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యంలో రాజానగరంలోని ఎంపీడీవో కార్యాలయంలో 5న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.మురళి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు విధిగా ఫార్మల్ దుస్తులతో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ఆరోజు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. వివరాలకు డీపీవో ప్రియ, 73967 40041 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్



మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్

గోకవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్య లు తప్పవని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ హెచ్చరించారు. మండలంలోని రంపయర్రం పాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లోని సచివాలయాల వద్ద సోమవారం ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, సారా విక్రయాలు, పేకాట, కోడి పందాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సమావేశంలో ఎస్ఐ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతుకూలీ సంఘం సభ్యులు

రీ సర్వే అవకతవకలపై విచారణ జరిపించాలి

గోకవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరామపట్నం గ్రామంలో రీ సర్వే అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండు చేస్తూ సోమవారం రెవెన్యూ కార్యాలయం ముందు ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిపారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ శివరామప్పటంలో సర్వే నెంబరు 4/1, 34/1, 35/2సి, 36/2ఏ లలో 36 ఎకరాల 39 సెంట్లు సీలింగ్ భూమిని అదే గ్రామానికి చెందిన నిరుపేదలు ఇరవై ఏళ్లగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. గత సంవత్సరం నిర్వహించిన రీ సర్వేలో ఆన్‌లైన్‌లో వేరే వాళ్ల పేర్లను నమోదు చేశారని, సర్వేలో తప్పులతడకలు ఉన్నాయని ఆరోపించారు. తక్షణమే ఈ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండులతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు సాయిప్రసాద్‌కు అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజబాబు, బి.రమేష్, నాయకులు కె.రామలింగేశ్వరరావు, డి.సురేష్, జాన్, కడితి సతీష్, శ్రీకాంత్ పెద్ద, అర్జున్, జీయన్న, సూరిబాబు, నాగు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ అత్యంత కీలకం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులకు పునాది అభ్యాసన శిక్షణ (ఎఫ్ఎల్ఎన్) అత్యంత కీలకమని జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. రాజానగరం మండలం కొండగుంటూరులోని సత్యశ్రీ పరిమళా పాలిటెక్నిక్ కళాశాలలో ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి డి.గౌరీశంకరరావు మాట్లాడుతూ తొమ్మిదవ విడత శిక్షణలో తూర్పుగోదావరి నుంచి 14 మంది, కాకినాడ నుంచి 95 మంది, అల్లూరి సీతారామరాజు నుంచి 169 మంది ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎంఈవో రామకృష్ణ, డైట్ లెక్చరర్ రాజకుమార్, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ అనూషతోబాటు అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల నుంచి ఒక్కొక్క కెఆర్పీ, 22 మంది డీఆర్పీలు పాల్గొన్నారని ఏఎంవో గౌరీశంకరరావు తెలిపారు.

రేపటి నుంచి చందన యాత్ర మహోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సింహాచల నగర్ శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో 5 నుంచి 9 వరకు 23వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం,కాలెపు నాగేశ్వరరావు తెలిపారు.శ్రీరంగం ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని అర్చకుడు అవసరాల కిరణ్‌స్వామి అన్నారు. ఆలయం నుంచి బుధవారం ఊరేగింపు మొదలై కంబాలచెరువు,దేవిచౌక్, సాయికృష్ణ, జాంపేట మీదుగా సుమారు 11 కిమీ సాగి తిరిగి ఆలయానికి చేరుకుంటుందన్నారు.

ముసలమ్మ ఆలయంలో పూజలు




కడియం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కడియపులంక ముసలమ్మ అమ్మవారి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా సోమవారం జ్ఞాన సరస్వతీదేవికి చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముసలమ్మ తల్లికి మహిళలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మిర్తిపాడు ఘర్షణ కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు

సీతానగరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్తిపాడులో ఆదివారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాల ఫిర్యాదుపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఒకవర్గం యువకులు మోటారు సైకిల్‌పై వెళుతూ, మరో వర్గం యువకులను రెచ్చగొట్టేలా ప్రవర్తించార న్నారు. దీనిపై వారు నిలదీయడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తి పరస్పరం కర్రలతో దాడులు చేసుకున్నారని ఎస్ఐ తెలిపారు. మిర్తిపాడుకు చెందిన మేడే దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదులో కె.దుర్గాప్రసాద్, కాళ్ళ నాగేంద్ర, గురు, శివలు కర్రలతో విచక్షణా రహితంగా తలపై కొట్టడంతో తీవ్ర గాయం అయిందన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసులకు దుర్గా ప్రసాద్ స్టేట్‌ఎంట్ ఇవ్వగా పై ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామన్నారు. దీనిపై డీఎస్పీ విచారణ జరుపుతున్నారని ఆయన తెలిపారు. మిర్తిపాడుకు చెందిన రాజపైడియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటనగరం, మిర్తిపాడుకు చెందిన పదిహేను మందిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మిర్తిపాడు, వెంకటనగరానికి చెం దిన యువకులు తనను కర్రలతో కొట్టడంతో తలకు గాయాలయ్యాయని పైడియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బజ్జి శరత్, వడపల్లి, సురేష్ బన్ను, కోనాల కిషోర్, పెనుగుల చందులతో పాటు పదిహేను మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. మిర్తిపాడులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

యువకుడిపై బీరుసీసాతో దాడి

గోకవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): యువకుడిపై బీరు సీసాతో మరో ఇద్దరు దాడిచేసి గాయపర్చిన ఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం...మండలంలోని పెంటపల్లి గ్రామానికి చెందిన పల్లెబోయిన దుర్గాప్రసాద్, మరొక బాలుడు కలిసి తిరుమలాయపాలెం గ్రామా నికి చెందిన గట్టుపల్లి వీరవెంకట దుర్గా ప్రసాద్‌పై పాత గొడవల నేపథ్యంలో కుంకులమ్మతల్లి గుడి వద్ద బీరు సీసాతో దాడి చేశారన్నారు. మద్యం మత్తులో జరిగిన ఈ దాడిలో వీరవెంకట దుర్గాప్రసాద్ ఛాతిపై ఎడమ భాగంలో గాయమైందన్నారు. జరిగిన ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పరిశీలించారు.





తంటికొండ వెంకన్నకు పూజలు చేస్తున్న అర్చకులు

3 వేల సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యుత్ శాఖ ద్వారా 2000, డీఆర్‌డీఏ ద్వారా 1000 యూనిట్లు స్థాపన లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టరేట్‌లో సోమవారం ఏపీ ట్రాన్స్‌కో, క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు.గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించాలనే లక్ష్యంతో సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుపై దృష్టి సారించినట్టు చెప్పారు. ఎక్కువ విద్యుత్ వినియోగించే వినియోగదారుల జాబితా సిద్ధం చేసి వారి గృహాలకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.ఈ మేరకు మండలాల వారీ టార్గెట్లు నిర్ణయించుకోవాలన్నారు.సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్ కుమార్,డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీవీఎస్.మూర్తి,ఈఈలు,ఏఈలు పాల్గొన్నారు.



పదిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డీఈవో

దివాన్‌చెరువు, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషిచేస్తున్నామని డీఈవో కంది వాసుదేవరావు అన్నారు. రాజానగరం మండలం పుణ్యక్షేత్రం జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు.పది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, విద్యార్థుల ప్రగతి గ్రేడుల వివరాలను హెచ్ఎం తాతారావును అడిగి తెలుసుకున్నారు.పబ్లిక్ పరీక్షలకు ఇక 40 రోజులు మాత్రమే సమయం ఉన్నందున ప్రతిక్షణం ఎంతోవిలువైనదన్నారు.పరీక్షలు అయ్యే వరకూ ఎవరూ మొబైల్ ఫోన్లు వాడవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాలు, చాటింగ్‌లు పూర్తిగా మానేయాలన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని సూచించారు. సెలవుల్లో కూడా పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు ఆరంభం

గోకవరం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం తంటికొండ గ్రామంలో స్వయంభూ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.దేవస్థానం మాజీ చైర్మన్ బది రెడ్డి అచ్చన్నదొర ఆధ్వర్యంలో మొదటిరోజున ఆలయ ప్రదక్షణ,స్వామి వారి పాదసేవ, హారతి, పంచమి సోమవారం సంకల్పం, విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం,రుత్విక్ వరుణ, దీక్షధారణ, అకల్మషకుష్మాండ హోమం,నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.స్వామికి వివిధ రకాల పూలతో అలంకరించగా,ఆలయాన్ని విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు.బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఉత్సవాలు 9వ తేదీ వరకూ జరుగుతాయి.

మళ్లీ ఓటు..రూటు!

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- ఎమ్మెల్సీపై కూటమి వ్యూహం
- పేరాబత్తులకే మద్దతు
- నామినేషన్లు ప్రారంభం
- ఈ నెల 27న పోలింగ్
- కూటమి కేడర్‌లో ఊపు
- పార్టీల వారీగా సమావేశాలు
- కానరాని మిగిలిన అభ్యర్థులు



ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నిడదవోలు మునిసిపల్ చైర్మన్ ఆదినారాయణ అభివాదం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కైవశం చేసుకోవడానికి తెలుగుదేశం-జనసేన- బీజేపీ కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికను కూటమి అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొంది.ఈ స్థానాన్ని గెలిపించే బాధ్యతను గోదావరి జిల్లాల నేతలకు, శ్రేణులకు అప్పగించింది. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 3 లక్షలకు పైగా పట్టభద్రుల ఓట్లు ఉన్నాయి. ఇప్పటికే కూటమి నేతలు, శ్రేణులు నియోజకవర్గాల వారీ సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు వేలాది మంది పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించిన సంగతి తెలిసిందే. సోమవారం నామినేషన్ల పర్వం ఆరంభం కావడంతో కూటమిలో మరింత ఉత్సాహం పెరిగింది. కూటమి నేతలు, కేడర్ ఐక్యంగా అభ్యర్థిని గెలిపించే పనిలో నిమగ్నమయ్యారు.ఇదిలా ఉండగా మిగిలిన అభ్యర్థులు ఎక్కడా కానరాకపోవడం శోచనీయం.కనీసం ప్రచారం లోనూ ఏ ఒక్కరూ ముందు లేరు. మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో సోమవారం నిడదవోలు, రాజమహేంద్రవరంలలో జనసేన నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.నిడదవోలు,కొవ్వూరు, గోపాలపురం నియోజక వర్గాల సమావేశాన్ని నిడదవోలులో,రాజమండ్రి సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి నియోజక వర్గాల సమావేశాన్ని రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో నిర్వహించారు.అభ్యర్థి పేరాబత్తుల రాజ శేఖర్‌ను అత్యంత మెజార్టీతో గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ప్రతి జన సైనికుడు 50 మంది పట్టభద్రులతో రాజశేఖర్‌కు ఓట్లు వేయించాలన్నారు. ఎన్నికల కోడ్ పూర్తికాగానే డీఎస్సీ కూడా నిర్వహిస్తారన్నారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి జిల్లా అంతటా ప్రచారం చేస్తారని తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కూటమి మీద నమ్మకంతో ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 3,13,261 ఓట్లు ఉన్నాయన్నారు. ఓటు వేసి గెలిపిస్తే పట్టభద్రులకు అండగా ఉంటానన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని ఇప్పటికే రాజశేఖర్ కలిసి మద్దతు కోరారు. త్వరలో జిల్లా స్థాయిలో బీజేపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. మాజీ మంత్రి కెఎస్ జవహర్ ఇతర నేతలు ప్రచారం చేస్తున్నారు. సమావేశంలో జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, అనపర్తి ఇన్‌చార్జి మారెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి నగర్ అధ్యక్షుడు వై.శ్రీను,గంటా స్వరూప,గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వేమన నారాయణ గౌడ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి ప్రియా సౌజన్య, బార్లపూడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

15 ఓపెన్ ర్యాంపుల్లో రేపటి నుంచి ఇసుక తీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఫోర్త్ బ్రిడ్జికి అవతల ఉన్న కాతేరు, అరికిరేవుల, తాళ్లపూడి ప్రాంతాల్లోని 15 ఓపెన్ రీచ్‌లను బుధవారం నుంచి ప్రారంభించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం కలెక్టర్ ప్రశాంతి జిల్లాలో ఇసుక తవ్వకాల పరిస్థితిపై సమీక్షించారు.మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీ ఆమోదం పొందిన ఇసుక ర్యాంపులన్నింటినీ బుధవారం నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. అందులో కాతేరు,అరికిరేవుల, తాళ్లపూడి తదితర ప్రాంతాల్లోని 15 ర్యాంపులు ఉన్నాయి. వీటి ద్వారా 4.2 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమవుతుందన్నారు. ఇప్పటికే పనిచేస్తున్న ర్యాంపుల్లో 8,62,719 టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. చట్టబద్ధమైన ర్యాంపుల్లో ఈ నెల 11 నుంచి 13 వరకూ పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నామని, వాటితో మరో 57,82,950 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యం అవుతుందని చెప్పారు. జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీవో కృష్ణనాయక్, ఏడీ మైన్స్ డి.ఫణి భూషణరెడ్డి పాల్గొన్నారు.

గీత కులాల మద్యం షాపుల దరఖాస్తు గడువు రేపే

రాజమహేంద్రవరం/నిడదవోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గీతకులాల వారికి 10శాతం మద్యం షాపులను ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం జిల్లాలో 11 షాపులు శెట్టిబలిజ, గౌడ్, గౌడలకు ఒక్కోటి చొప్పున మొత్తం 13 షాపులు కేటాయించారు.ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5గంటల లోపుగా దరఖాస్తులు సమర్పించాలని అధికారులు తెలిపారు.దరఖాస్తుదారులు ప్రభుత్వం నిర్ణయించిన రూ.2లక్షల నాన్ రిఫండబుల్ రుసుంను డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ రాజమండ్రి తూర్పు గోదావరి జిల్లా పేరున డీడీ తీసి దరఖాస్తుతో పాటు స్థానిక ఎక్సయిజ్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు.



ఖాళీ..రైలు!

రైల్వే బడ్జెట్‌లో నిరాశే

నిర్మలమ్మ పద్దు జిల్లాలోని రైల్వేకి నిరాశను మిగిల్చింది. గతంలో ఇచ్చిన కేటాయింపులనే ఇప్పుడు మళ్లీ కొత్తగా ప్రకటించడంపై గోదావరి వాసులు విస్తుపోతున్నారు. పుష్కరాలకు ఇంకో రెండేళ్ల సమయం మాత్రమే ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కొత్త లైన్లు గానీ, కొత్త రైళ్లు గానీ లేవు. వందేభారత్ రైళ్లనే తెరపై చూపిస్తూ సామాన్యుల ప్రయాణ పాట్లను పక్కన పెట్టేశారు. మొత్తానికి కేంద్రం, రాష్ట్రంలో మంచి పరిచయాలున్నా, పురందేశ్వరి ఎంపీగా ఉన్నా ఉమ్మడి జిల్లాకు ఈ బడ్జెట్‌లో ఏమీ ఒరగకపోవడంపై విమర్శలు వినవస్తున్నాయి. రాయితీల ఊసూ లేదు..

- నాటి అమృత్ నిధులే.. కొత్తగా..
- బడ్జెట్‌లోనూ ఆ రూ.270 కోట్లే
- పుష్కరాల నిధులపై క్లారిటీ నిల్
- గతంలో ఇచ్చినవే కొత్తగా చెప్పిన వైనం
- కడియం-నిడదవోలు లైన్‌కు నిధులేవి!
- కొవ్వూరు,అనపర్తిలో హాల్ట్‌ల ఊసేలేదు
- వృద్ధులు, జర్నలిస్టుల రాయితీ మరిచారు
- సామర్లకోటకు కేటాయింపుల్లేవ్
- బడ్జెట్‌లో రైల్వే నిధులపై పెదవి విరుపు

రాజమహేంద్రవరం/సామర్లకోట,ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి): అంతా పాతే.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన రైల్వేస్టేషన్లకు కొత్త కేటాయింపులు లేకపోవడంతో రైల్వే బడ్జెట్ నిరాశమిగిల్చింది.2027లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఖచ్చితంగా కేటాయింపులు ఉంటాయని అంతా ఆశించారు.అయితే ఏమీ లేకపోవడంపై పెదవి విరుస్తున్నారు. కేంద్ర రైల్వే బడ్జెట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రైల్వేస్టేషన్ల అభివృద్ధికి తాజాగా నిధులేమీ కేటాయించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిలిపివేస్తున్న పలు రైళ్లను యథాతథంగా నడిపేందుకు తాజాగా రైల్వే ఏ కీలక నిర్ణయం తీసుకోలేదు.

ఇప్పటికే అధికం

రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు ఇప్పటికే సామర్థ్యానికి మించి రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. గూడ్స్ రైళ్లతో కలిపి 200 రైళ్లు పరుగులు పెడుతున్నాయి. దీంతో ఒక రైలుకు, మరో రైలుకు మధ్య ప్రయాణ నిడివి బాగా తగ్గిపోయింది. ఈ క్రమంలో పుష్కరాలకు కొత్త రైళ్లు వేస్తే వాటిని ఎలా నడిపిస్తారో చూడాల్సి ఉంది. ఆర్చ్ బ్రిడ్జి నిర్మించిన సమయంలో పక్కనే మరో వంతెన నిర్మాణానికి అనువుగా స్పాన్ (స్తంభాలు)లలో ప్రొవిజన్ పెట్టారు. అంటే ఇప్పుడు వంతెన నిర్మిస్తే సరిపోతుంది. స్పాన్‌లు నిర్మించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఉన్న ఆర్‌సీఆర్‌బీ,ఆర్చ్ బ్రిడ్జిలపై ట్రాఫిక్ దృష్ట్యా రైళ్లను కొవ్వూరులో లేదా ఔటర్‌లో కొద్ది సేపు నిలపడం చేస్తున్నారు. దీంతో ఆర్చ్ బ్రిడ్జిపై వంతెన నిర్మాణమైతే చాలా ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా కడియం నుంచి నిడదవోలు వరకూ లైను వేయడం ద్వారా గూడ్స్ రైళ్లను మళ్లించడం ద్వారా రాజమండ్రి స్టేషనుపై ఒత్తిడి తగ్గించవచ్చనే ఆలోచన చేస్తున్నారు.ఈ లైను విషయం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. దీని నిధుల విషయం కూడా బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. నిడదవోలు రైల్వేస్టేషన్‌లో 1.5 కిలోమీటర్ల లూప్ లైను నిర్మిస్తున్నామని మాత్రం చెప్పారు.

నాటి అమృతమే.. నేడేం లేదు..

ఆంధ్ర ప్రదేశ్‌లోని అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి పథకంలో 72 ప్రధాన రైల్వేస్టేషన్లను రూ.3,141 కోట్ల మేర నిధులతో అభివృద్ధి చేసేందుకు గతేడాది ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు సుమారు రూ.271 కోట్లు, సామర్లకోట స్టేషన్‌కు రూ.15.13 కోట్లు కేటాయించారు. ప్రస్తుత రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులు భారీగా ఉంటాయని ఆశించారు. ఏమీ లేకపోవడంపై ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిడదవోలుజంక్షన్, కొవ్వూరు, రాజమహేంద్రవరం,కడియం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, కాకినాడ, పిఠాపురం, అన్నవరం తుని వంటి స్టేషన్లు ఉన్నా కనీసం పట్టించుకోవడం లేదు.రాజమహేంద్రవరం,సామర్లకోట వంటి ప్రధాన రైల్వే స్టేషన్లలోనూ అమృత్ అభివృద్ధి పనుల్లో వేగం లేదు..

పుష్కరాలకు నిధుల్లేవ్..

కుంభమేళాకి ప్రయాగ్‌రాజ్.. గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం. 2027లో పుష్కరాలు జరగనున్నాయి.ఈ మేరకు ఇప్పటి నుంచీ నిధులు సమకూరితే తప్ప ప్రయోజనం ఉండదు.ఈ బడ్జెట్‌లో పుష్కరాలకు నిధుల కేటాయిస్తారని గోదావరి జనం ఆశించారు.కానీ అమృత్ భారత్ కింద రాజమహేంద్రవరం,నిడదవోలు,సామర్లకోట రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని మాత్రమే పేర్కొన్నారు.ఇప్పటికే రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు రూ.271 కోట్లు కేటాయించారు. పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి.దీన్నే కొత్తగా ఇచ్చినట్లు చూపించడం విస్మయానికి గురిచేస్తోంది. రాజమహేంద్రవరం ఎంపీగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉన్నా కేటాయింపులు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.ఇక కొవ్వూరు-సత్తుపల్లి రైల్వే లైను గురించి ప్రస్తావన లేకపోగా..కరోనా సమయంలో కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో రైళ్ల హాల్ట్ నిలుపుదల చేశారు.అదే సమయంలో వృద్ధులకు,జర్నలిస్టులకు రైలు ప్రయాణాల్లో ఇచ్చే రాయితీని తీసేశారు.ఈ సారి బడ్జెట్‌లో వీటి పునరుద్ధరణపై ప్రకటన వెలువడుందని ఆశించినా నిరాశే మిగిలింది. రాజమహేంద్రవరం నుంచి బెంగళూరు,భువనేశ్వర్‌లకు రెండు వందేభారత్ రైళ్లను గతంలోనే ప్రకటించారు. ప్రస్తుతం వాటి నిమిత్తం రాజమహేంద్రవరం మెము కార్ షెడ్‌లో పనులు జరుగుతున్నాయి.ఇవి కాకుండా హైదరాబాద్, బెంగళూరు,భువేశ్వర్‌లకు సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రాజమండ్రి నుంచి బయ లుదేరే విధంగా నడపాలనే డిమాండ్ ఉన్నా నిరాశే మిగిలింది.

గోదావరి స్టేషన్‌ను వదిలేశారా?

రాజమహేంద్రవరంలో గోదావరి రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. పుష్కరాల సమయంలో ఈ రైల్వే స్టేషను రద్దీలో భాగం పంచుకుంది.ఈ రైల్వేస్టేషను పుష్కర, కోటిలింగాల ఘాట్లకు దగ్గరగా ఉండడంతో ఎక్కువ మంది జనం ఈ రైల్వేస్టేషనులోనే దిగుతారు. పైగా సాధారణ రోజుల్లో కూడా ఇక్కడ రైళ్లను ఆపాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.ఈ రైల్వేస్టేషన్‌ని పుష్కరాలనాటికి అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఇలా రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి నిధులనే బడ్జెట్‌లో చూపించి సరిపెట్టుకోమనడంతో బడ్జెట్‌పై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

ఆర్వోబీలు, ఆర్‌యూబీలు ఎక్కడ?

రైల్వేగేట్లవద్ద ప్రమాదాలను శాశ్వతంగా నివారించేందుకు, ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు 2027 నాటికి అన్ని రైలు గేట్లను తొలగిస్తామన్న రైల్వే గతంలో చేసిన ప్రకటన నేడు ప్రచారంలో లేకపోవడం విచారకరం. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో గూడూరు నుంచి అనకాపల్లి స్టేషన్ల మధ్య 390 రైలు గేట్లు ఉన్నట్టు గతంలోనే రైల్వే అధికారులు గుర్తించారు.వీటిని తొలగించి ఆర్‌యూబీలు, ఆర్వోబీలు నిర్మిస్తామన్నారు.వీటికోసం రూ.2,400 కోట్ల మేర నిధులు ప్రతిపాదించారు.ప్రస్తుత బడ్జెట్‌లో వీటి నిర్మాణాలకు నిధులు కేటాయింపులు లేకపోవడంపై రైల్వే అధికారులు ఖంగుతిన్నారు.

సుందర సాయికి ఏకాదశ రుద్రాభిషేకాలు



సాయిబాబాకు అభిషేకాలు నిర్వహిస్తున్న కృష్ణారావు దంపతులు

కొవ్వూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీ సుందర సాయినాథుడికి సోమవారం ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. సుందర సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు గుడివాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ 30వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంటు తాతా కృష్ణారావు, వెంకటేశ్వరీ దంపతులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయిబాబాను పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం మద్దుకూరి సుగుణ బృందం సంపూర్ణ భగవద్గీతా పారాయణం, ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు కొండూరి నిహాల్ భక్తి సంగీత విభావరి అలరించింది. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి, ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ సుబ్బారావు, కసిరెడ్డి సీతారామయ్య, గణేష్, సురేష్, రాంబాబు, మూర్తితోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొవ్వూరు నుంచి పరిశుద్ధ పంచక్షేత్ర దర్శిని



పంచక్షేత్ర దర్శిని బస్సును ప్రారంభిస్తున్న డీఎం కుమార్

కొవ్వూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి పరిశుద్ధ పంచక్షేత్ర దర్శిని బస్సును డీఎం వైవీవీఎస్ కుమార్ సోమవారం ప్రారంభించారు. కొవ్వూరు నుంచి క్రైస్తవ పుణ్యక్షేత్రాలైన నాగాపట్నం వేళాంకిణి గని మాత ఆలయం, కొయంబత్తూరు పాల్ దినకరన్ ప్రార్థనా మందిరం, చెన్నైలోని జీఎస్ దినకరన్ ప్రార్థన గోపురం, విజయవాడ గుణదల మేరిమాత ఆలయం, గౌరీపట్నం నిర్మలగిరి మాత ఆలయాలకు ప్రత్యేక బస్సును పంపించారు. డీఎం మాట్లాడుతూ గతంలో రెండు బస్సులు పంపించామని, సోమవారం పరిశుద్ధ క్షేత్ర దర్శిని మూడో బస్సును పంపించామన్నారు. అలాగే ఈ నెల 14న ముస్లింల కోసం అజ్మీరు యాత్ర స్పెషల్ బస్సును పంపించడం జరుగుతుందన్నారు. ఈ యాత్రలో నాగపూర్, అజ్మీర్, ఆగ్రా చూపించి తిరిగి 6 రోజుల్లో బస్సు కొవ్వూరు చేరుకుంటుందన్నారు. ఈ యాత్ర స్పెషల్ బస్సు మనిషి ఒక్కింటికి టిక్కెట్టు రూ. 8100(భోజనం, వసతి ఎవరివి వారివే) అన్నారు. అజ్మీర్ యాత్ర కోసం ఎస్కే మౌలాలి 93909 40056ను సంప్రదించాలన్నారు.

నంగాలమ్మ తల్లికి చీర, సారె సమర్పణ



నిడదవోలులో నంగాలమ్మకు పూజలు చేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నిడదవోలు గ్రామ దేవత నంగాలమ్మ అత్తవారింటికి వెళ్లే సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం జనసేన పార్టీ పట్టణాధ్యక్షుడు రంగా రమేష్ ఆధ్వర్యంలో పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చీర సారె సమర్పించారు. తదుపరి మేళతాళాలతో చలువ చీరలపై నంగాలమ్మ అత్తింటి వరకు వెళ్లి అమ్మవారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో వంగా నాగేశ్వరరావు, ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, తిరుపతి సత్యనారాయణ, గుడ్ల బుజ్జి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'హలో మాదిగ-చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ



నిడదవోలులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నిడదవోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే హలో మాదిగ-చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ని యోజకవర్గ ఇన్‌చార్జి గాలింకి రాము అన్నారు. సోమవారం స్థాని క ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద హలో మాదిగ-చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా సీనియర్ నాయకుడు భీమ డోలు కిరణ్‌కు మార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మాదిగలంతా డప్పులు చేతబట్టి భాగ్యనగరానికి రావాలన్నారు. కార్యక్రమంలో బైపే రాజేశ్వర్రావు, సనమండ్ర వెంకట్రావు, గెడ్డం రవీంద్ర, తాతి పూడి జగదీష్, తానేటి శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్‌లో ర్యాలీ చేస్తున్న దృశ్యం

గోపాలపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి చెక్‌పోస్టు సెంటర్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 10నుంచి ఈ నెల 10వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామ న్నారు. ప్రతిఒక్కరు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి అతివేగంతో వాహనాలు నడపడం ద్వారా ప్రాణాల మీదకు తెచ్చుకున్నవారవుతారన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సత్యానందం, హోంగార్డు రవి, టీడీపీ ఎస్సీ సెల్ మండల కార్యదర్శి దాసరి రవి, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతో ఆరోగ్య సమస్యల గుర్తింపు



అనంతపల్లిలో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

నల్లజర్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తొలిదశలోనే విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ద్వారా వారిలోని రక్తహీనత, తక్కువ బరువు, బీపీ, పోషకాహార లోపం సమస్యలను గుర్తించవచ్చని డాక్టర్ గంగాధర్ అన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సోమవారం స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ బరువు, రక్తహీనత లోపం ఉన్న వారికి ఐరన్ మాత్రలు అం దించామని, పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రార్థనలు

కొవ్వూరు బీసీ బాలుర వసతిగృహంలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



హాస్టల్లో ఏర్పాటు చేసిన ప్రార్థనల బ్యానర్

కొవ్వూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రార్థనలు నిర్వహించిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర వసతిగృహంలో ఆదివారం అరుణోదయ ఆరాధనల పేరుతో మత ప్రార్థనలు నిర్వహించారు. వాటిని అటుగా వెళ్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి కంటమణి రామ్‌కుమార్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టడంతో విషయం బయటపడింది. మత ప్రార్థనలు ఇష్టం లేకపోవడంతో భవనం కిందకు వెళ్లిపోయామని విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల నుంచి సమాచారం తెలుసుకున్న వార్డెన్ హాస్టల్‌కు చేరుకుని ప్రార్థనలను నిలుపుదల చేశారు. దీనిపై హాస్టల్ అధికారి ఆర్.చిరంజీవిని ప్రశ్నించగా భవన యజమానులు ప్రార్థనలు పెట్టుకుంటామని అడిగారని, ప్రభుత్వ భవనంలో ప్రార్థనలు నిర్వహించరాదని చెప్పామన్నాని, తాను ఇంటికి, హాస్టల్ విద్యార్థులు ఆడుకోవడానికి వెళ్లిన సమయంలో భవన యజమానులు అనధికారికంగా అద్దెకు ఇచ్చిన పైఅంతస్తులో మత ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారని, సమాచారం తెలిసిన వెంటనే హాస్టల్‌కు వచ్చి ప్రార్థనలను నిలుపుదల చేయించామని పేర్కొన్నారు.



గౌరీపట్నం మహాలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతి పూజ నిర్వహిస్తున్న వేదపండితులు

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి

రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

నిడదవోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుపశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలులోని లయన్స్ ఆడిటోరియంలో జనసేన ఆధ్వర్యంలో నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, నిడదవోలు మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన నాయకులు డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, రంగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి మూడు పార్టీల నాయకులు కృషిచేయాలన్నారు. పట్టణ పరిధిలో 9754 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో 15 బూత్‌లు ఉన్నాయని, ఒక్కొక్క బూత్‌కు మూడు పార్టీల నుంచి ముగ్గురు చొప్పున కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి 40మంది ఓటర్లను ఒక నాయకుడికి బాధ్యతలు అప్పగించి ఎన్నికల ప్రచారానికి వెళ్తామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో 20 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లారని, ఏటా జాబ్‌కార్డు విడుదల చేస్తానని, మెగా డీఎస్సీ తీస్తామని యువతను మోసం చేశారన్నారు. రాబోయే రోజుల్లో దశల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖరంను అత్యధిక ఓట్లతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, మద్దిపట్ల సురేష్ పాల్గొన్నారు.

వసంత పంచమి పూజలు

- సరస్వతిదేవి ఆలయాల్లో విశేష అర్చనలు
- చిన్నారులకు అక్షరాభ్యాసం



చాగల్లులో సరస్వతి పూజలు చేస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, సరస్వతీ హోమం, చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక శ్రీసూర్య హైస్కూల్లో సరస్వతీ పూజలు చేశారు. టీటీడీ ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణ విద్యార్థులతో పూజలు, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సీతామహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి ఉషోదయ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సరస్వతీదేవి పూజలు చేశారు. అనంతరం 96 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్టు కరస్పాండెంట్ ఎంఎస్ చెల్లారావు, ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి తెలిపారు.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త జడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులు సరస్వతి దేవి విగ్రహానికి నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా రచయిత, ప్రముఖ వక్త, రిటైర్డ్ లెక్చరర్ వాడ్రేవు సుందర రావు విద్యార్థులకు స్వీట్స్ పంచి, ఆశీర్వదించారు. మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయిని సీతామహాలక్ష్మి పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగల్లు: స్థాని శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో సరస్వతి దేవికి పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయి. అక్షరాభ్యాసాన్ని పాఠశాల డైరెక్టర్ వీవీ రామారావు చేయించారు. అలాగే స్థానిక శివాలయంలోని సరస్వతిదేవి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



అనంతపల్లిలో సామూహిక అక్షరాభ్యాసం దృశ్యం



తాళ్లపూడిలో పిల్లలకు అక్షరాభ్యాసం దృశ్యం



మోర్త హైస్కూల్లో సరస్వతిదేవికి పూజలు

చెరుకు ఉత్పత్తికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు

- తాడువాయిలోని ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ మూసివేత
- షుగర్ కేన్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ
- దేవరపల్లిలో ఉయ్యూరు కేసీపీ షుగర్స్ ప్రాంతీయ కార్యాలయం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

దేవరపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చెరుకు ఉత్పత్తికి ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు కల్పిస్తోందని షుగర్ కేన్ డిప్యూటీ కమిషనర్ ఎం.సత్యనారాయణ అన్నారు. దేవరపల్లిలో ఉయ్యూరు కేసీపీ షుగర్స్ ప్రాంతీయ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే సీజన్ నుంచి తాడువాయిలో ఉన్న ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీని యాజమాన్యం మూసివేస్తున్నట్టు ప్రభుత్వానికి తెలియజేశారన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు షుగర్ ఫ్యాక్టరీలు మాత్రమే ఉన్నాయన్నారు. ఉయ్యూరు ఫ్యాక్టరీకి ఉభయ గోదావరి జిల్లాల్లో చెరుకు పంటకు ప్రభుత్వం ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రోత్సాహకం అందిస్తోందన్నారు. చెరుకు విస్తీర్ణం పెంచడానికి ఉయ్యూరు ఫ్యాక్టరీ రైతులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తుం దని, ఉత్తమ యాజమాన్య పద్ధతులు అమలు చేయడానికి చెరుకు పండించడానికి సహకరి స్తుందన్నారు. కేసీపీ షుగర్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెరుకు పంటకు తమ ఫ్యాక్టరీ పలు ప్రోత్సాహకాలు అం దిస్తోందని, రైతులకు అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు, రవాణాలో సబ్సిడీ అందిస్తామన్నారు. అలాగే చెరుకు మొక్కలను కూడా సమకూరుస్తామని, దీని వల్ల అధిక దిగుబడి సాధిం చవచ్చన్నారు. రైతులకు చెరుకు పంటపై ఖర్చు తగ్గించడానికి మెకనైజేషన్‌పై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెరుకు పండించే రైతులు కేవీ రామారావు, వెంకన్నబాబు, ఏవీ భూపతయ్య, కొఠారు భగవన్నారాయణ, కూచిపూడి దొరాజీ, ఫ్యాక్టరీ ఫీల్డ్ అసిస్టెంట్లు హరికృష్ణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన..ఆరు నెలలకే!

- ప్రాణం తీసిన పొగమంచు
- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న వ్యాన్, తలపై నుంచి దూసుకెళ్లిన ట్రాక్టర్
- పోతవరంలో ఘటన
- మృతుడి భార్య 4 నెలల గర్భిణీ
- పోతవరంలో విషాదఛాయలు



ప్రసాద్‌బాబు(ఫైల్)



ప్రమాదానికి కారణమైన వ్యాన్

నల్లజర్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పొగమంచు ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ద్విచక్ర వాహనాన్నిఓ వ్యాన్ ఢీకొనడంతో కిందపడిపోయిన ఆ వాహనదారుడి తల పైనుంచి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పోతవరం పాత పేటకు చెందిన తానేటి ప్రసాద్, భూలక్ష్మి దంపతులకు హరిశ్చంద్రప్రసాద్ బాబు(24), కృష్ణబాబు, మమత సంతానం. ప్రసాద్‌కు ఆరు నెలల క్రితం నబీపేటకు చెందిన చిన్నారితో వివాహమైంది. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. ప్రసాద్ జంగారెడ్డిగూడెంలోని ఓ సెల్‌ఫోన్ షాపులో పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై పోతవరం నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్తుండగా షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కొయ్యలగూడెం నుంచి నల్లజర్ల వైపు ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వ్యాన్ ఢీకొంది. దీంతో ప్రసాద్ కింద పడిపోయాడు. ఆ సమయంలో నల్లజర్ల నుంచి కొయ్యలగూడెం వైపు వెనుక వస్తున్న ట్రాక్టర్ అతని తల పై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మంచు ప్రభావంతో డ్రైవర్లకు కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ మోహన్‌రావు తెలిపారు.

కోకో సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన

చాగల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యాన అధికారిణి సుజాత కుమారి అన్నారు. సోమవారం నెలటూరు అచ్యుతరామ ప్రసాద్‌కు చెందిన కొబ్బరిలో కోకో సాగు తోటలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్ తోటలలో కోకోను సాగుచేసి అధిక లాభాలు పొందవచ్చునన్నారు. కోకో కాయలు కోసేసిన తరువాత ఎరువులు వాడి తగిన సస్య రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కోకో గింజల ధరల విషయంలో రైతులు కంపెనీ ప్రతినిధులతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, రైతులు ముళ్ళపూడి మరళి, శ్రీనివాస్, గెడా శ్యామ్, ఆళ్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని జిల్లా మాల ఉద్యోగుల సంఘం నేతలు ప్రకటించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగిన మాల ఉద్యోగుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా మాల ఉద్యోగుల సంఘం ఛైర్మన్‌గా ఎల్‌వీ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా జి.కెన్నెడి బాబు, కోకన్వీనర్లుగా ఆర్టీసీ చిరంజీవి, జె.సత్యనారాయణ, వై.సతీష్, పి.నాగ సురేష్, జల్లి ప్రసాద్, కే.విజయ్, ఎస్.వెంకట్రావు, ఏలేటి రాజారావు, ఎన్.సత్యనారాయణ, కె.దానబాబు, నక్క విజయకుమార్, కె.శ్యాంసుందర్, కోశాధికారులు జంగం సుబ్బారావు, ఎలిపే శ్రీని వాస్‌లను ఎన్నుకున్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మహాలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతి పూజ

దేవరపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం గౌరీసమేత మహాలింగేశ్వర స్వామి పరివార దేవతలు ధ్వజస్తంబం, మహా కుంభాభిషేకం మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయం వద్ద ఉదయం వేదపారాయణ, గోపూజ, గవ్యాంత పూజలు, దేశకంకణధారణ, త్రిశూలపూజ, వాస్తుపూజ, వాస్తుహోమం, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. సాయంత్రం గణపతిపూజ, అగ్నిమదనం, అగ్నిప్రతిష్ఠాపన, గజరోహణం, నవకలశార్చన, మూల మంత్ర హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేసింది.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమే

కొవ్వూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏ స్థాయిలో అయినా విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమేనని కొవ్వూరు ఏబీఎన్&పీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్ అన్నారు. కళాశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కళాశాల ఎడ్వయిజర్ ఎస్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ సెల్ ఫోను, సోషల్ మీడియా విద్యార్థులను పెడదోవ పెట్టిస్తోందని, వాటికి దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో హోలి ఏంజిల్స్ కరస్పాండెంటు వీఎస్ ఆంటోని, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

తాళ్లపూడి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండలాధ్యక్షుడు అంకెం సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. మోటివేటర్ అనంతం సాయి పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఎగిరే విమానం చూసి ఆనందపడడం కన్నా విమానాన్ని నడపాలని లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను సంస్థ ఛైర్మన్ సింహాద్రి జనార్దనరావు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అప్పన హనుమంతరావు, ప్రసాద్, వెంకటేష్, అనంతం రాంబాబు, ఉపాధ్యాయ సిబ్బంది, పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ శర్మ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 03 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ కేఎస్ఆర్ శర్మ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పసలపూడి, సూర్యారావు పాలెం, సత్యవాడ గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్ల పక్క చెత్తచెదారాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో సిల్ట్‌ను తొలగించి, బ్లీచింగ్ చల్లి పారిశుధ్య నిర్వహణ చేయాలని సూచించారు. గ్రామాల్లో సర్పంచ్‌ల సహకారంతో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లలో వర్మీ కంపోస్టు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఈవోపీఆర్డీ సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ మండల కోఆర్డినేటర్ కె.ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

వ్యక్తికి తీవ్ర గాయాలు

తాళ్లపూడి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో సోమవారం మోటారుసైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో బైక్‌పై వెళుతున్న తాళ్లపూడికి చెందిన చీదెళ్ల వెంకటరాజును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి కాలుకు బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కారు ఎవరిది అనేది తెలియాల్సి ఉంది. ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ ఆసుపత్రి నుంచి సమాచారం అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.